తూతూమంత్రంగా ఇసుక పిల్టర్ల కూల్చివేత





నవతెలంగాణ-కంది

మండలంలోని బ్యాతోల్ , చిద్రుప్ప,ఆరుట్ల గ్రామాల్లో గురువారం గిర్దవర్ రంగయ్య అక్రమ ఇసుక ఫిల్టర్‌లను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ ఎవరైన అక్రమంగా ఇసుక తయారు చేస్తే శాఖపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక తయారు చేసే పిల్టర్లను నామమాత్రంగానే కూలగొడుతున్నారని అయా గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల చనువుతోనో, నాయకుల చనువుతోనోగానీ ఇసుక దందా మాత్రం మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తుందని అయా గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు వస్తున్నారు, ఇసుక తయారు యంత్రాలను ధ్వంసం చేస్తున్నారని, అయినప్పటికీ అక్రమార్కుల ఆగడాలు ఆగడం లేదనీ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నవతెలంగాణ

మెదక్

1

శుక్రవారం | 28 మార్చి 2025 | www.navatelangana.com

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా విష్ణువర్ధన్ రెడ్డి

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి బార్ అసోసియేషన్‌లో జరిగిన ఎన్నికల్లో మరోసారి అధ్యక్షులుగా విష్ణువర్ధన్ రెడ్డి విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా భూపాల్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా వి.మహేష్, సంయుక్త కార్యదర్శిగా ఎస్. మల్లేశం, క్రీడల కార్యదర్శిగా టి. శ్రీనివాస్, గ్రంథాలయ కార్యదర్శిగా నిజాముద్దీన్ రషీద్, మహిళ ప్రతినిధిగా మంజుల రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా బుచ్చయ్య, సుభాష్ చందర్, నరసింహ, మాణిక్ రెడ్డి, రాములు, ఎం. దత్తాత్రి, భాస్కర్ విజయం సాధించారు.

ప్రవీణ్ పగడాల మృతిపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలి

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్



నవతెలంగాణ-సంగారెడ్డి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన ప్రవీణ్ పగడాల మృతి అనుమానాస్పదంగా ఉందని, తక్షణమే సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ మరణం అనేక అనుమానాలకు దారి తీస్తుందన్నారు. సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు. క్రైస్తవులపై దాడులు అరికట్టాలన్నారు. మతం వ్యక్తిగత విశ్వాసం లాగా ఆయన భావించి క్రిస్టియన్ మతాన్ని స్వీకరించాడని, వివిధ టీవీ డిబేట్‌లలో తన మతంలోని మంచి అంశాలను చెబుతూనే సమాజంలో జరుగుతున్న అనేక రకాల అవమానాలను ఎండగట్టారన్నారు. దళితులపై దాడులు జరిగినప్పుడు పలుమార్లు చర్చించే వాడని గుర్తు చేశారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే ఉన్మాదులు ఏ మతంలో ఉన్నా దేశానికి ప్రమాదమేనని స్పష్టం చేశారన్నారు. ఆయనను చంపుతామని బెదిరింపులు కూడా చేశారని, అలాంటివారిని విచారించాలన్నారు. ఒక మనిషిని మరొక మనిషి చంపుకోవడం, అవమానించడం, కించపరచడమనేది ఏ మతం చెబుతుందన్నారు. ప్రవీణ్ పగడాల మృతి పట్ల కేవీపీఎస్ ప్రగాఢ సంతాపం ప్రకటిస్తుందని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరు శివకుమార్, కె.సుభాష్, జిల్లా సహాయ కార్యదర్శులు బి.ప్రవీణ్, ఎమ్.దాస్ తదితరులు పాల్గొన్నారు.

సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



నవతెలంగాణ-సంగారెడ్డి

సిఎస్ఆర్ నిధులతో జిల్లాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సిఎస్ఆర్ నిధుల వినియోగం పనుల పురోగతిపై కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అధికారుల ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో సి ఎస్ ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రిలో అంగన్వాడి కేంద్రాలలో మౌలిక వసతుల మెరుగు కోసం వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం ప్రహరీ గోడల నిర్మాణం మంచినీటి సరఫరా సదుపాయాల కల్పన, ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన అధునాతన పరికరాల కొనుగోలు ఆసుపత్రుల భవనాల మరమ్మత్తులు పేషంట్ల అదనపు బెడ్ల ఏర్పాటు అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి చిన్నారుల కోసం బొమ్మల ఏర్పాటు భవనాలకు పెయింటింగ్ పరిశుభ్రత వాతావరణం కల్పించడం తదితర అవసరాల కోసం సిఎస్ఆర్ నిధులు జిల్లాలో కేటాయించినట్లు తెలిపారు. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 25 కోట్ల సిఎస్ఆర్ నేతలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. వాటిని వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి జిల్లాలోని పరిశ్రమల యజమానులు సహకరించాలని కోరారు. పరిశ్రమల యజమాన్యాల సహకారంతో జిల్లాలో 2025-26 సంవత్సరానికి సంబంధించి సిఎస్ఆర్ నిధుల వినియోగాన్ని మరింత ప్రణాళికాబద్ధంగా చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, వసతి గృహాలు, ఆసుపత్రుల అవసరాలను గుర్తించి, ముందస్తుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు, జిల్లాలోని పరిశ్రమల యజమానులు, ప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నవోదయకు ఎంపికైన రాంరెడ్డి పేట విద్యార్థులు

నవతెలంగాణ-కల్హేర్



మండలంలోని రామ్‌రెడ్డి పేట గ్రామానికి చెందిన అవసుల మధుశ్రీ , పూల మనోజ్‌లు నవోదయకు ఎంపికయ్యారు. విద్యార్థుల ఎంపిక పట్ల వారి తల్లిదండ్రులు గ్రామస్తులు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. తమ పిల్లలు నవోదయకు ఎంపిక కావడం చాలా సంతోషం కలిగించిందని, విద్యా బోధనలు చేసి మంచి నైపుణ్యం తీసుకొస్తున్న ఉపాధ్యాయులకు ' ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో ముస్లిం సిబ్బందికి ఇఫ్తార్ విందు

జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్

నవతెలంగాణ-సంగారెడ్డి



రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో జిల్లా పోలీసులకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ 'దావత్-ఇ-ఇఫ్తార్'ను ఏర్పాటు చేశారు. ఈ విందులో జిల్లా పోలీసు అధికారులతో పాటు ముస్లిం సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని, ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముస్లింలా పవిత్ర మాసం రంజాన్ అని, రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు నెల రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో, నిష్టగా ఉపవాస దీక్ష చేస్తారన్నారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో తొమ్మిదవ నెల అయిన పవిత్ర రంజాన్ మాసంలో రోజువారీ ఉపవాసాన్ని ముగించడానికి, సూర్యాస్తమయం తర్వాత మగ్రిబ్ ప్రార్థన అనంతరం తీసుకునే భోజనమే ఇఫ్తార్.. అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు.ఎస్పీ ఎ.సంజీవరావ్, నయీమొద్దీన్ ఇన్స్పెక్టర్స్, ఎస్పీ ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, ఆర్.ఐ. రామ రావ్, ముస్లిం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామోజీ ఫిలింసిటీ యజమాన్యంపై కేసు నమోదు చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, నాయకుల అరెస్టు, నిర్బంధం సిగ్గుచేటు
- పేదలకు కేటాయించిన భూములను వెంటనే పేదలకు ఇవ్వాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రభుత్వ, పేదల భూములు కబ్జా చేసిన రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యంపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండు చేశారు. గురువారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ స్థలాల్లో ఇండ్లు నిర్మించుకోవడానికి వెళ్లిన పేదలను, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు, జిల్లా నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రామోజీ ఫిలింసిటీ దగ్గర నాగన్‌పల్లి, పోల్కంపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 700 మంది పేదలకు ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున 2007 సంవత్సరంలో ప్రభుత్వం పట్టాలిచ్చిందన్నారు. కానీ ఆ భూమి మీదకు ప్రజలు వెళ్లి నివాసం ఏర్పాటు చేసుకోకుండా రామోజీ సంస్థ దారిని ఆక్రమించి, చుట్టూ గోడ నిర్మించి సెక్యూరిటీని పెట్టి అడ్డుకుంటున్నదన్నారు. స్థలాలలోకి వెళ్లిన 75 మంది పేదలపై గతంలో అక్రమ కేసులు పెట్టి సంవత్సరాల తరబడి కోర్టులు చుట్టూ తిప్పిందన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించకుండా జాప్యం చేస్తూ, రామోజీ సంస్థకే అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 400 మంది లబ్దిదారులను వారికి ఇచ్చిన స్థలాల వద్దకు తీసుకెళ్లడంతో పోలీసులు నాయకులపై, పేదలపై కర్కశంగా ప్రవర్తించి అరెస్టులు చేశారన్నారు. ఈ దుశ్చర్యను సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. తక్షణమే ప్రభుత్వ భూమిని ఆక్రమించిన రామోజీ సంస్థపై కేసులు నమోదు చేయాలని, పేద ప్రజలకు తమ ఇంటి స్థలాలను అప్పగించి, అక్కడే నివాసం ఉండే విధంగా ఇండ్లు నిర్మించుకోవడానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రాజయ్య, మానిక్, సాయిలు, నర్సింలు, నాయకులు యాదగిరి, నాగేశ్వర రావు, వీరస్వామి, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

మార్పును అందిపుచ్చుకోవాలి

- టెడ్‌ఎక్స్ వక్తల సూచన
- విజయవంతంగా ముగిసిన టెడ్‌ఎక్స్ గీతం హైదరాబాద్-2025





నవతెలంగాణ-పటాన్‌చెరు

మార్పు అనివార్యమని, దానిని అందిపుచ్చుకుని వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని టెడ్‌ఎక్స్ వక్తలు సూచించారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఆధ్వర్యంలో 'టెడ్‌ఎక్స్ గీతం హైదరాబాద్-2025'ని గురువారం విజయవంతంగా నిర్వహించారు. విభిన్న రంగాల నుంచి విచ్చేసిన, అత్యంత విశిష్ట అతిథులు మార్పు గురించి స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకత్వం, విద్య, పాలన, మీడియా, ఆర్థిక శాస్త్రం, భావోద్వేగ మేధస్సుపై లోతైన అవగాహనను వక్తలు కల్పించి, ఆహూతుల లో అర్థవంతమైన చర్చను లేవనెత్తారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి, రక్షణ శాఖల మాజీ మంత్రి ఎం.ఎం.పల్లంరాజు టెడ్ ఎక్స్‌ను ప్రారంభిస్తూ, చిన్న వయస్సులోనే పిల్లలను స్వయం సమృద్ధం చేయాలని, పాఠశాల విద్య నాణ్యతను పెంచాలని, నైతిక విలువలు, నీతి, పర్యావరణ స్పృహ ను పాఠ్యాంశాలలో చేర్చాల్సిన తక్షణ ఆవశ్యకతపై ఆయన ఆకర్షణీయమైన ప్రసంగం చేశారు. విద్యారంగం, పరిశ్రమ మధ్య అంతరాన్ని తగ్గించడం, ప్రభుత్వం, ఆర్థిక సంస్థలు, వ్యవస్థాపకుల మధ్య చురుకైన భాగస్వామ్యాలను పెంపొందించడం తప్పనిసరని ఆయన పేర్కొన్నారు. మేధో సంపత్తి, ఆవిష్కరణలలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెట్టడానికి పరిశోధనా పెట్టుబడులను గణనీయంగా పెంచాల్సిన ప్రాముఖ్యతను పల్లంరాజు నొక్కి చెప్పారు. న్యూస్ మొబైల్ వ్యవస్థాపకుడు, ఎడిటర్-ఇన్-చీఫ్, ప్రఖ్యాత పరిశోధనాత్మక జర్నలిస్టు, గ్లోబల్ ఫ్యాక్ట్ చెకర్ సౌరభ్ శుక్లా మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో జర్నలిజం అభివృద్ధి చెందుతున్న అంశాన్ని ప్రస్తావించారు. సంచలనాత్మకత కంటే వాస్తవ ఖచ్చితత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన గీతం విద్యార్థులకు సూచించారు. బాధ్యతాయుతమైన జర్నలిజాన్ని రూపొందించడంలో చారిత్రక అవగాహన పాత్రను సౌరబ్ నొక్కి చెప్పారు. ప్రఖ్యాత సెలబ్రిటీ యాంకర్, జర్నలిస్టు, కవయిత్రి, చలనచిత్ర విమర్శకురాలు అతికా ఫరూఖీ మాట్లాడుతూ, సినిమా సమాజంపై చూపే ప్రభావాన్ని, అది అందించే శక్తివంతమైన సందేశాలను వివిధ చిత్రాలను ఉదహరిస్తూ నొక్కి చెప్పారు. సినిమా టికెట్ కొనడం అంటే దానికి అనుకూలంగా ఓటు వేయడం లాంటిదని, చలన చిత్రాలను ప్రేక్షకులు శ్రద్ధగా చూడాలని, వినాలని సూచించారు. ఆలోచనా రహిత, బాధ్యతా రహిత చిత్రాలను తిరస్కరించాలని అతికా సూచించారు. ప్రజల అవగాహనను రూపొందించడంలో, సామాజిక మార్పును ప్రభావితం చేయడంలో మీడియా యొక్క పరివర్తన శక్తి గురించి ఆమె వివరించారు. ప్రముఖ ఆర్థికవేత్త, భారత 13వ ఆర్థిక కమిషన్ పూర్వ సలహాదారు డాక్టర్ రతిన్ రాయ్, జాతీయ పురోగతిని నడిపించడానికి ఆర్థిక పరివర్తన, స్థిరమైన వృద్ధి, వ్యూహాత్మక విధాన రూపకల్పనపై విలువైన అవగాహనను కల్పించారు. ది లెర్నింగ్ కర్వ్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్య నిర్వహణాధికారి సుబ్బు పరమేశ్వరన్ మాట్లాడుతూ, నిజమైన ఆవిష్కరణ అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా ఉపయోగించడంలో ఉందని, అర్థవంతమైన మార్పును సృష్టించాలనే నిజాయితీ గల ఉద్దేశ్యంతో నడపబడుతుందని చెప్పారు. చిన్న ఆవిష్కరణలు కూడా గణనీయమైన ప్రభావానికి దారితీస్తాయని, పరిమితులకు అనుగుణంగా ఉండటం అన్ని ఆవిష్కరణల యొక్క ఆత్మగా ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు జాగ్రత్తగా సమన్వయం చేస్తూ, వక్తలు, ఇందు పాల్గొన్నవారికి సజావుగా, ప్రభావవంతమైన అనుభవాన్ని అందించడానికి తోడ్పడ్డారు. ఈ టెడ్‌ఎక్స్ దార్శనిక నాయకులకు కొత్త ఆలోచనలను పంచుకోవడానికి, తదుపరి తరానికి స్ఫూర్తిని చ్చేందుకు, ఆయా విభాగాలలో అర్థవంతమైన మార్పును తీసుకురావడానికి తోడ్పడే అర్థవంతమైన వేదికగా నిలిచింది.

కరెంటోళ్ల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- విద్యుత్ షాక్ గురై రైతు మృతి
- మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చెన్నాపూర్‌లో ఘటన
- అధికారుల తీరుకు వ్యతిరేకంగా గ్రామస్తుల ధర్నా







నవతెలంగాణ-శివ్వంపేట

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి రైతు నిండు ప్రాణం బలైపోయిన హృదయ విషాదకర సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని చెన్నాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నాపూర్ గ్రామానికి చెందిన సింగిరెడ్డి సుధాకర్ రెడ్డి (45) తనకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేస్తూనే చిన్నగొట్టిముక్కుల గ్రామానికి చెందిన ఒక కాంట్రాక్టర్ దగ్గర డ్రైవర్‌గా కూడ పనులు చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేయదని భావించి తనకున్న వ్యవసాయ పొలాన్ని కొంత అమ్ముకుని కొత్తగా ఇల్లు నిర్మిస్తున్నాడు. తాను నూతనంగా నిర్మిస్తున్న ఇంటి ముందు 11 కేవీ విద్యుత్ ట్రాన్స్ పార్మర్ ఉండి, హైటెన్షన్ లైన్ విద్యుత్ తీగలు సుధాకర్ రెడ్డి ఇంటికి తగిలేలా ప్రమాదకంగా ఉన్నాయని కరెంట్ ఏఈ, ఏడిఈకి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోవడమే కాకుండా ఒక రైతు ప్రాణాన్ని అధికారులే బలిగొన్నారని బాధిత కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

లంచాలకు మరిగిన కరెంట్ అధికారులు

లంచాలకు మరిగిన కరెంట్ అధికారులకు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ ఇక్కడి నుంచి తొలగించేందుకు అప్పు తెచ్చయినగాని లక్ష రూపాయలు లంచం ఇచ్చేందుకు కూడ సుధాకర్ రెడ్డి ఒప్పుకున్నాడని, అయినా కరెంట్ అధికారులు ప్రమాదకర విద్యుత్ ట్రాన్స్ పార్మర్ తొలగించలేదని బాధిత కుటుంబసభ్యులు మండిపడ్డారు.

అధికారుల తీరుపై గ్రామస్తుల ఆందోళన

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి ఒక మంచి మనిషిని కోల్పోయామని ఆగ్రహం చెందిన గ్రామస్తులు గోమారం, చిన్నగొట్టిముక్కుల ప్రధాన రహదారిపై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ మధుకర్ రెడ్డి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ అధికారులతో ఫోన్లో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని, సమస్యను దగ్గరుండి పరిష్కరిస్తామని గ్రామస్తులను సముదాయించి ధర్నాను విరవింపయింపజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భారతి బిక్షపతి, మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎరుకలి బిక్షపతి, బోల్ల ఆంజనేయులు, రాంచంద్రం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాంత సమస్యలపై పెదవి విప్పని నాయకులు

అంగరంగ వైభవంగా జన్మదినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-గుమ్మడిదల



గుమ్మడిదల, నర్సాపూర్ ప్రాంతం నీరు, వాయు కాలుష్యం అవుతుందని, డంప్ యార్డును ఎత్తివేయాలని రెండు గ్రామాల ప్రజలు ఒకవైపు 51 రోజులుగా నిరవధిక సమ్మెలు చేస్తుంటే మరోవైపు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అంగరంగ వైభవంగా జన్మదినోత్సవ వేడుకలు చేసుకోవడం పట్ల పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలు, రైతులు ప్రాంతం కోసం పనిచేసిన వ్యక్తికి పట్టం కట్టాలని, ప్రాంత ప్రయోజనాలు పట్టించుకోని వారు ఎలా రాజకీయ మనుగడ కొనసాగిస్తారో రానున్న రోజుల్లో చూస్తామని ఆయా గ్రామాల ప్రజలు హెచ్చరించారు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తున్న నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్, కొత్తపల్లి, గుమ్మడిదలతో పాటు నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో నిరవధిక సమ్మెలు చేయడంతో పాటు పండుగలను సైతం చేసుకోకుండా పోరాటాలు చేస్తుంటే కనీసం ఒక్కనాడు కూడా స్పందించని నాయకులు ప్రాంతం కలుషితం అయిపోతుంది మొర్రో అని ప్రజలు ఒకవైపు ఆవేదన చెందుతుంటే, ప్రజల సమస్యపై పెదవి విప్పని ఆవుల రాజిరెడ్డి గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకోవడం బాధాకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను రూపొందించే అత్యున్నత అసెంబ్లీ సాక్షిగా ప్రాంత సమస్యలపై పెదవి విపిన నాయకులు నిరసనలు ధర్నాలు చేస్తున్నప్పటికీ అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రాంత ప్రజలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఇకనైనా ప్రాంత ప్రజల సమస్యలపై పోరాడుతున్న వారికి మద్దతు తెలపాల్సిన అవసరం ఎందైనా ఉందని, ఎప్పుడు ఎలా వ్యవహరించాలో తెలుసుకొని నడుచుకోవాలని గ్రామస్తులు సూచించారు.

జీవితంపై విరక్తితో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-మనోహరాబాద్



మద్యానికి బానిసైన వ్యక్తి జీవితంపై విరక్తితో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కాళ్లాకల్‌లో గురువారం ఉదయం జరిగింది. మృతుడి భార్య మమత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కాళ్ళాకల్ గ్రామానికి చెందిన కమలేష్ యాదవ్ (23) గ్రామంలోనే వెల్డింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కాగా గత కొంత కాలంగా కమలేష్ మద్యానికి బానిసై ప్రతి రోజు తాగి వస్తుండేవాడు. కాగా బుధవారం 12 గంటల రాత్రి తాగి వచ్చి అన్నం తిన్న అనంతరం తిరిగి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి చుట్టు పక్కల వెదికినా ఫలితం లేకపోయింది. గ్రామ శివారులో గల స్మశాన వాటిక పక్కన ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కిందకు దింపిన తరువాత చూడగా అప్పటికే కమలేష్ మృతి చెందాడు. కమలేష్ మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు కమలేష్ భార్య ఇచ్చిన ఫిర్యాదుతో మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-మనోహరాబాద్



ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి మళ్లి ఇంటికి రాని సంఘటన మండలంలోని రంగాయిపల్లి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రంగాయిపల్లి గ్రామానికి చెందిన మన్నె అజయ్ కుమార్ (27) బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంటి నుండి వెళ్లినట్టు పోలీసులు తెలిపారు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదని తెలిపారు. దాంతో కుటుంబ సభ్యులు చుట్టు ప్రక్కన వెదరగా. గ్రామ శివారులో గల చింతల కుంట చెరువు వద్ద అజయ్‌కుమార్ బట్టలు, చెప్పులు కనబడినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. దాంతో చెరువులోకి దిగి వెదికినప్పటికి ఆచూకి దొరకలేదన్నారు. అజయ్‌కుమార్ ఆచూకిని గుర్తించి తెలపాలంటూ అతని అన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నిజాంపేట : మండల కేంద్రంలో జరుగుతున్న నేషనల్ హైవే రోడ్డుకు కరెంటు పోల్స్ వేస్తున్న సందర్భంగా ఈ నెల 28వ తేదిన మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కరెంటు నిలిపివేస్తున్నట్లు ఏఈ గణేష్ తెలిపారు. పట్టణ వ్యాపారస్తులు ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్ట్

నిందితుడి నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం

జోగిపేట సీఐ అనిల్ కుమార్



నవతెలంగాణ-జోగిపేట

వట్ పల్లి మండలం ఖాదీరాబాద్ గ్రామంలో ఈనెల 11న జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు జోగిపేట సీఐ డి.అనిల్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం వివరాలను వెల్లడించారు. ఖాదీరాబాద్ గ్రామానికి చెందిన బూసిరెడ్డిపల్లి కిషన్‌ను అదే గ్రామానికి చెందిన కొట్టి గౌరమ్మ(40) దూషించినందుకు ఆమెపై కక్ష పెంచుకొని ఈనెల11న రాత్రి మందు సేవించి ఒంటరిగా నివాసముండే మృతురాలి ఇంటికి వెళ్లి గొడవ పడుతుండగా ఇంత రాత్రి నా ఇంటికి వస్తావా అని కిషన్‌ను బెదిరిస్తుండగా ఇంతలోనే ఆమెను లోపలి రూమ్ లోకి లాక్కొని వెళ్లి ఆమెపై లైంగిక దాడి చేసి ఆమె గొంతు నులిపి హత్య చేశాడు. అనుమానం రాకుండా ఒంటిపై ఉన్న బంగారం, వెండి వస్తువులు, సెల్ ఫోన్ దొంగలించి, మంచం నవారా తగలబెట్టి అక్కడి నుంచి పారిపోయాడు. హత్య సంఘటన జరిగిన నాటి నుంచి నేరస్తుడు గ్రామంలో కనిపించకపోవడంతో అతనిపై అనుమానంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఖాదీరాబాద్ గ్రామంలో కిషన్ ఉన్నట్లు సమాచారం తెలుసుకొని గురువారం అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. అతని వద్ద నుంచి బంగారు కమ్మ, గుండ్లతో ఉన్న నల్లపూసల దండ, జత వెండి పట్టగొలుసులు, నోక్యా ప్యాడ్ మొబైల్ స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు.

స్కావెంజర్ల వేతనాలను వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



స్కావెంజర్ల వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలి, శ్రీనివాస్ రాథోడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్టేట్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస్ రాథోడ్ లు మాట్లాడుతూ పాఠశాలల పరిశుభ్రత కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా నియామకం చేపట్టిన స్కావెంజర్ల వేతనాల గురించి ప్రస్తావించగా డిసెంబర్ ,జనవరి ,ఫిబ్రవరి, మార్చి ఏప్రిల్ నెలలకు సంబంధించి ఒకేసారి ఏప్రిల్ మొదటి వారంలో కలెక్టర్ ఆదేశాలతో విడుదల చేయనున్నామని డిఇఓ తెలియజేశారని తెలిపారు. గత సంవత్సరం స్పాట్ వాల్యుయేషన్ సంబంధించిన రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరారు. 2025 మార్చిలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల స్పాట్ వాల్యుయేషన్‌లో అనారోగ్య తదితర కారణాలు, చంటి పిల్ల తల్లులు మొదలగు వారిని డ్యూటీ నుంచి మినహాయించాలని, ఇదే సందర్భంలో స్పాట్ కావాలని అడిగిన వారిని అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి జీవన్ రాథోడ్, బషీద్ అహమ్మద్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణకుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా భోజీ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్



నారాయణఖేడ్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా భోజీ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చంద్ర శేఖర్ రావు, కార్యదర్శి నర్సింహా రావు, సహాయ కార్యదర్శి గా సంగమేశ్వర్ రెడ్డి కోశాధికారి సాయిలు కమిటీ సభ్యులు గా నర్సారెడ్డి ఆనంద్ స్వరూప్ శెట్కార్ లక్ష్మన్ రావు లను ఎన్నుకున్నారు..

అసెంబ్లీలో గళమెత్తిన జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలో గతంలో చేపట్టిన నిమ్స్ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు గురువారం అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. గతంలో 2011 వ సంవత్సరంలో ఏర్పాటైన నిమ్స్ ప్రాజెక్ట్‌లోని కంపెనీలకు సంబంధించి పనులు ప్రారంభించినా ఎటువంటి పనులు ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి, పనులను త్వరగా పూర్తి చేయాలని, దీని ద్వారా జహీరాబాద్ నియోజవర్గ ప్రజలకు ఉపాధి కలుగుతుందన్నారు. జహీరాబాద్ నియోజవర్గంలోని బాలికల ఉర్దూ మీడియం కళాశాలలో లెక్చరర్లు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వ లెక్చరర్లను నియమించి, నియోజకవర్గ విద్యార్థినిల భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనంతరం జహీరాబాద్ నియోజక అభివృద్ధి పనులన్నీ కుంటు పడ్డాయన్నారు. గతంలో ప్రారంభించిన పనులు అర్ధాంతంగా నిలిచిపోయాయని, ఆ పనులన్నింటినీ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

అంబేద్కర్ అందరి వాడు



నవతెలంగాణ-మనూర్

డా బి ఆర్ అంబెడ్కర్ అందిరి వాడని, రాజంగా నిర్మాత అని నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే డా పి. సంజీవ్ రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామిలు అన్నారు. మండలంలోని కమలాపూర్ గ్రామంలో గురువారం అంబెడ్కర్ విగ్రహావిష్కరణ కావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ గొప్ప మహనీయులని, ఆయన అడుగు జాడల్లో నడుచుకోవాలన్నారు. కులం మతం అని భేదం లేకుండా అందరు కలిసి కట్టుగా ఉండి ఆయన ఆశయాలు నెరవేర్చాలని సూచించారు. ప్రపంచ దేశాలు సైతం మన దేశ రాజ్యాంగం బాగుందని కొనియాడారన్నారు. దిగంబర్‌ఈ కాంబ్లె మాట్లాడుతూ ప్రజలందరికి ఉచిత విద్య వైద్యం కార్పొరేట్ స్థాయిలో అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ శెట్కార్, గుర్రపు మచ్చేందర్, ప్రజా సంఘాల నాయకులు వివిధ గ్రామాల అంబెడ్కర్ వాదులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు గడువు గండం



- గ్రామాల్లో కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలు
- గడువులోపు పూర్తయితేనే ఫలితం
- గడువు మించితే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం
- హడావిడి పనుల్లో నాణ్యతపై అనుమానాలు
- పర్యవేక్షించేందుకు సిబ్బంది కొరత

నవతెలంగాణ-ఝరాసంగం

గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిఏటా సీసీ రోడ్ల నిర్మాణాలకు ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేస్తుంది. ప్రతి ఆర్థిక సంవత్సరం చివరలో వీటిని మంజూరు చేయగా, గుత్తేదారులు నామినేటెడ్ పద్ధతి ద్వారా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు పనులను అప్పగిస్తున్నారు. కానీ నిర్దేశిత గడువులోగా రోడ్ల నిర్మాణం పనులు పూర్తికాక ఆ నిధులు చాలావరకు వెనక్కి వెళుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ పనుల పర్యవేక్షణ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతుంది. ప్రస్తుతం మండలానికి 24 పనులు మంజూరు కాగా 17 పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగతా పనులు పూర్తి కావడానికి గడువు సమీపిస్తుండడంతో పూర్తవుతాయా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కానీ అధికారులు మాత్రం మిగిలినవి ప్రోగ్రెస్‌లో ఉన్నాయని పేర్కొంటున్నారు.

ప్రతి ఏటా ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది. కానీ ఈ పథకం కింద నిధులు సక్రమంగా రాకపోవడం, పనులలో లోపాలు వంటి అనేక కారణాలతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. ప్రతి ఏటా ప్రభుత్వం కోట్ల రూపాయలు కేటాయిస్తున్నా వాటిని వినియోగించడంలోనూ విఫలమవుతున్నట్లు తెలుస్తోంది. గ్రామాలలో నేటికీ మట్టిరోడ్లే దర్శనమిస్తున్నా వాటి నిర్మాణాలకు గుత్తేదారులు గాని, స్థానిక ప్రజా ప్రతినిధులు గాని ముందుకు రావడం లేదు. ఏడాది మొదటి, రెండో విడతలలో రూ.90 లక్షలతో 24 పనులను మంజూరు చేసింది. మొదటి విడతలో రూ.40 లక్షల పనులు మంజూరు చేయగా.. రెండో విడతలో రూ.50 లక్షలు కేటాయించింది. మండలానికి ఈ పథకం కింద 24 పనులు మంజూరయ్యాయి. ఈ పనులను అధికారులు నామినేషన్ పద్ధతిన స్థానిక గుత్తేదారులు, స్థానిక ప్రజా ప్రతినిధులకు, ఔత్సాహికులకు అప్పగించారు. ఈ పనులను మార్చి నెలలోనే పూర్తి చేయాల్సి ఉంటుంది. పూర్తిచేసిన పనులకు సైతం ఈ నెల 31వ తేదీ వరకు ఎంబి కూడా చేయాలి. కానీ పనులు పూర్తి చేయడంలో తాత్సర్యం జరగడం.. ప్రారంభంలోనే ఆలస్యం చేయడం, పూర్తిచేసిన పనులకు ఎంబి రికార్డులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం కారణంగా పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని తెలుస్తోంది.

గడువులోపు పనులు పూర్తయ్యేనా?

ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో రోడ్లను నిర్మించడం ప్రజలకు వరంగానే చెప్పవచ్చు. కానీ ఈ పనులు చేపట్టేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. వివిధ ఆటంకాల కారణంగా ఈ పనులు సకాలంలో పూర్తి కావడం గగనంగా మారుతుంది. అంతేకాకుండా పనులు పూర్తి చేసిన వారికి సకాలంలో బిల్లులు రాకపోవడం మరో పెద్ద సమస్యగా మారుతుంది. గత సంవత్సరం చేసిన రోడ్ల నిర్మాణ పనులకు ఇప్పటివరకు బిల్లులు రాలేదని ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంబిలు పూర్తయిన వాటికి సైతం నేటికీ బిల్లులు రావడం లేదన్నారు. అనేకమంది అప్పులు తీసుకొచ్చి పనులు చేపట్టినా, వారికి సకాలంలో బిల్లులు రాక అప్పులు పెరిగి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి కారణాలతోనే చాలామంది పనులు చేసేందుకు ముందుకు రావడంలేదని తెలుస్తోంది.

హడావిడి పనులు.. నాణ్యతపై అనుమానాలు

ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులు ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలి. కొన్ని గ్రామాలలో పూర్తయినా, మరికొన్ని గ్రామాలలో నిర్మాణాలు హడావిడిగా కొనసాగుతున్నాయి. ఇంకా అనేకచోట్ల పనులు ప్రారంభించనేలేదు. గడువు ఇంకా మూడు రోజులు మాత్రమే ఉంది. మరోపక్క హడావిడి పనులు ప్రారంభించడంతో నాణ్యతపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. నిర్మించిన సీసీ రోడ్ల పనులకు క్యూరింగ్ సక్రమంగా లేకపోవడం, ఇష్టరీతిన నిర్మిస్తుండడం కారణంగా పనులు చేపట్టిన 6 నెలల లోపే పగుళ్లు ఏర్పడుతున్న సందర్భాలున్నాయి. అధికారుల పర్యవేక్షణ కూడా అంతంత మాత్రంగానే ఉంది. మండలానికి పంచాయతీరాజ్ ఉపకార్య నిర్వహణ కార్యాలయం కేటాయించినప్పటికి, అందులో సరైన సిబ్బంది లేక పర్యవేక్షణ కొరవడుతోందనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సాధించి సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీవో



నవతెలంగాణ-వట్పల్లి

మండలంలోని నిర్జప్ల గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో అంజయ్య గురువారం పరిశీలించారు ఉపాధి కూలీలు ఉదయం పూట తమకు నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేసుకోవాలన్నారు. జాబ్ కలిగిన వ్యక్తి మాత్రమే పనికి రావాలి తప్ప కుటుంబ సభ్యులలో జాబ్ కార్డు లేకున్నా జాబ్ కార్డు ఉన్న వారి పేరు పైన పనికి రాకూడదన్నారు. పేరు ఒకరిది పని ఒకరు చేస్తే అట్టివారికి కూలి డబ్బులు చెల్లించేందుకు హాజరు వేయకూడదన్నారు. ఆ విధంగా ఎవరైనా చేసి ఉంటే వారి మీద చట్టప్రకారమైన చర్యలు ఉంటాయన్నారు. పనులు జరుగుతున్న ప్రాంతానికి గ్రామ కార్యదర్శులు వెళ్లి పర్యవేక్షించాలన్నారు కార్యదర్శులు ఉదయం పూటనే తమ తమ గ్రామాలకు చేరుకోవాలన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శితో పాటు పలువురు ఉన్నారు

పాస్టర్ ప్రవీణ్ మృతికి నిరసనగా ర్యాలీ



నవతెలంగాణ-రామచంద్రాపురం

రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల ప్రమాద ఘటనకు నిరసనగా రామచంద్రాపురం పట్టణంలో పటాన్‌చెరు నియోజకవర్గ పాస్టర్‌లు, క్రిస్టియన్ అసోసియేషన్ సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం శాంతియుతంగా కొవ్వొత్తులతో ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పాస్టర్ ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు పీటర్ జైపాల్, దేవదానం, ప్రవీణ్, పాస్టర్లు, క్రైస్తవ సంఘం పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావాన్ని ప్రకటించారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల కుటుంబానికి న్యాయం జరగాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులు



నవతెలంగాణ-వట్పల్లి

మండలంలోని మేడికుంద గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులను గురువారం ప్రా రంభించినట్లు కాంగ్రెస్ పార్టీ గ్రా మ అధ్యక్షులు రిటైర్మెంట్ ఉపా ధ్యాయులు ఖమర్ రావు తెలిపారు పిఆర్ఆర్ నిధుల కింద మంజూరైన ఐదు లక్షలతో 120 మీటర్ల పొడవు రోడ్డును మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో పాప్రారంభించినట్లు తెలిపారు. 50 ఏళ్లుగా బురదమయమైన రోడ్డుతో అవస్థలు పడుతున్న వారికి, సీసీ రోడ్డుతో సమస్యలు దూరం కానున్నాయన్నారు. రోడ్డు నిర్మాణంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శంకరప్ప, గ్రామ ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు యాదయ్య, బేతయ్య, నాగయ్య సురేష్, ప్రభు, మానయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేజింతల్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-న్యాల్‌కల్

రేజింతల్ గ్రామంలో ఎన్ ఆర్ ఈజీఎస్ రూ.10 లక్షల నిధులతో బీసీ కాలనీలో గురువారం సీసీ రోడ్ల పనులకు కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు మాజీ ఎంపిటిసి నల్లవల్లి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మరమ్మత్తులకు నోనుకొని రోడ్ల సమస్య తీరిందన్నారు. బీసీ కాలనీలో సీసీ రోడ్లకు మోక్షం లభించిందన్నారు. దశల వారిగా గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనులు చేపడుతున్నామన్నారు . బీసీ కాలనీలో సిసి రోడ్ల ప్రారంభం పట్ల కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మైమూద్ అలీ, సిరాజోద్దీన్, తిరుపతి రెడ్డి, మనెన్న, విట్టల్, శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులున్నారు ..

జాన్‌వెస్లీ పోరాటానికి 'సాహసం' సంపూర్ణ మద్దతు

- అవసరమైతే ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధం




నవతెలంగాణ-మునిపల్లి

పేదల, ప్రభుత్వ భూములను ఆక్రమించిన రామోజీ యాజమాన్యంపై కేసు పెట్టాలని, పట్టాలు పొందిన పేదలకు స్థలాలను ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ చేసిన పోరాటానికి సాహసం సంపూర్ణ మద్దతు ఇస్తుందని సాహసం రాష్ట్ర అధ్యక్షులు డా.ముప్పారం ప్రకాశం తెలిపారు. పేదలకు అండగా నిలిచిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు నాయకులను అరెస్టు చేయడాన్ని సామాజిక హక్కుల సంఘం (సాహసం) తీవ్రంగా ఖండిస్తుందన్నారు. పేదలకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాలలోకి వెళ్ళిన 75 మంది పేదలపై గతంలో అక్రమ కేసులు పెట్టి సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిప్పారన్నారు. జిల్లా కలెక్టర్, పోలీస్ యంత్రాంగం, స్థానిక ఎంఎల్ఏ జోక్యం చేసుకుని దీనిని పరిష్కరించకుండా జాప్యం చేస్తూ, రామోజీ సంస్థకే అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 400 మంది లబ్ధిదారులను వారికి ఇచ్చిన స్థలాల వద్దకు తీసుకెళ్లడంతో పోలీసులు నాయకులపై, పేదలపై కర్కశంగా ప్రవర్తించి అరెస్టులు చేసిందన్నారు. ఈ దుశ్చర్యను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం చేస్తున్న పోరాటినికి మద్దతునిస్తూ, బహుజన ప్రజా సంఘాలతో కలిసి ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవుతామని హెచ్చరించారు.



ఘనంగా ఆవుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-గుమ్మడిదల

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి జన్మదినోత్సవ వేడుకలు గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని టోల్ గేట్ వద్ద కాంగ్రెస్ యువ నాయకుడు ఎం.నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ఆవుల రాజిరెడ్డికి ఘనస్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి, శాలువా జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు ఆవుల రాజిరెడ్డి నాయకత్వంపై ప్రశంసిస్తూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ గౌడ్, మండలి తులసీదాస్, జయశంకర్ గౌడ్, ఆకుల ఆంజనేయులు మేకల యాదగిరి, రవీందర్ రెడ్డి, రాజిరెడ్డి, మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి హామీని చట్ట ప్రకారం నిర్వహించాలి

- కేంద్ర ప్రభుత్వం ఉపాధి పని నుండి కూలీలను దూరం చేస్తుంది
- నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టంను వెంటనే రద్దు చేయాలి
- ప్రమాద బీమా, పని ప్రదేశంలో మరణిస్తే రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.నర్సిములు



నవతెలంగాణ-సంగారెడ్డి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ నుంచి కూలీలను, పేదలను దూరం చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.నర్సిములు అన్నారు. గురువారం ఉపాధి హామీ పనులు జరుగుతున్న కల్పగూర్, ఇరిగిపల్లి గ్రామాలలో పర్యటించి కూలీల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సిములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేయడం కోసం అనేక రకాల ఇబ్బందులు కూలీలపై మోపుతోందన్నారు. అందులో భాగంగానే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం తీసుకువచ్చిందన్నారు. దీని ద్వారా వారంలో 6 రోజులు పని చేస్తే 4, 5 రోజులకే హాజరు వస్తుందన్నారు. చేసిన పనికి డబ్బులు రాక కూలీలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు లాంటి పనులను తొలగించి చిన్నచిన్న పనులను చూయించడంతో కూలీలకు పనులు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన రోజుకు రూ.300 కూలీ ఎక్కడా రావడం లేదని, రూ.150 నుంచి రూ.250 వరకు వస్తుందన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా రోజు కూలి రూ.600కు పెంచాలన్నారు. ఝరాసంగం మండలం బిడకన్నె గ్రామంలో పనులు నిర్వహించి ఇంటికి వస్తున్న కూలి మార్గమధ్యంలో మరణించారని, ఆ కూలి కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు లేకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మెడికల్ కిట్లను వెంటనే పని ప్రదేశంలో ఉంచాలన్నారు. బకాయిలు ఉన్న డబ్బులను వెంటనే ఇవ్వాలని, ప్రతివారం కూలీలకు డబ్బులు చెల్లించాలని లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్, యశోద, భారతమ్మ, శ్రీశైలం, మనీలా, కిష్టయ్య, నాగమణి, శమంత, అనసూయ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సంక్షేమానికి డీడీఎస్, కేవీకే కృషి అభినందనీయం

- జెడి శివప్రసాద్



నవతెలంగాణ-జహీరాబాద్

చిరుధాన్యాల సంక్షేమానికి రక్షణకు డీడీఎస్, కేవీకే చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని వ్యవసాయ శాఖ జెడి శివప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక కేవీకేలో గ్లోబల్ సైన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ, వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత 25 సంవత్సరాల నుంచి కేవీకే, డీడీఎస్ వారు సమన్వయంతో జహీరాబాద్ ప్రాంతంలో పాత పంటలను సంరక్షించేందుకు వాటి పోషక విలువలను తెలియపరిచేందుకు చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమన్నారు. ఈ సంస్థలో సభ్యులుగా ఉన్న నిరక్షరాస్య దళిత మహిళలు దేశ విదేశాలకు వెళ్లి చిరుధాన్యాల ప్రాముఖ్యతను తెలియపరచడం జరిగిందన్నారు. రైతులకు ముందస్తుగా వివిధ పంటలు నాటేందుకు, నాటే ముందు, మొలక, కోత సమయాలలో తీసుకోవల్సిన జాగ్రత్తలను కేవీకేల ద్వారా అందరికీ పరిజ్ఞానాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. జహీరాబాద్ ఏడిఏ బిక్షపతి మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు అన్ని రకాల శిక్షణలో కేవీకేల ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక అధికారి రామాచారి మాట్లాడుతూ రాజీవ్ యువశక్తి పేరుమీద ఎన్నో వ్యవసాయ పనిముట్లను రైతులకు వివిధ కేటగిరీల్లో సబ్సిడీలపై అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ చిరుధాన్యాలతో పాటు అన్ని పంటలకు ప్రాధాన్యత ఇస్తూ రైతులకు శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే, డీడీఎస్ శాస్త్రవేత్తలు శైలజ, రమేష్, స్నేహలత, హేమలత, కేశవ్, ప్రయాగ్, మొగులమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులు నూతన ఒరవడితో లాభాలు పొందాలి

- సామాజిక విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ విజయలక్ష్మి



నవతెలంగాణ-జోగిపేట

వ్యవసాయ రంగంలో, గృహ విజ్ఞానంలో రైతులు నూతన ఒరవడి సాధించి లాభాలు పొందాలని సామాజిక విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.విజయలక్ష్మి సూచించారు. గురువారం మండల పరిధిలోని కంసాన్పల్లిలో గ్రామీణ భాగస్వామ్య కృషి అనుభవ కార్యక్రమం- ముగింపు సభ, రైతు ప్రదర్శన నిర్వహినంచారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా ముగింపు ప్రదర్శన ప్రోగ్రామ్‌లో విద్యార్థులు చేసిన పని మూల్యాంకనం చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త కోఆర్డినేటర్ రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ రైతులకు సామాజిక, గృహ విజ్ఞానంలో మేలైన యాజమాన్య పద్ధతులు, ఈ యాసంగిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, మెలకువలు రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడీ ప్రతినిధి డా.కె.శ్వేత, డా.లక్ష్మి చల్లా డా. సుప్తా సర్కార్, డాక్టర్. ప్రెట్టీ రాణి, డాక్టర్ సంధ్య గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డి, గ్రామ ఏఈవో మౌనిక , మాజీ ఎంపీటీసీ బాలయ్య , గ్రామ రైతులు తధితరులు పాల్గొన్నారు.

సిద్ధి గణపతి దేవాలయ భూమి పరిరక్షణకు చర్యలు

- గణేష్ దేవస్థానం ఈఓ ఎన్.లావణ్య



నవతెలంగాణ-పటాన్‌చెరు

రుద్రారం గ్రామం గణేష్ గడ్డలోని స్వయంభుగా వెలసిన శ్రీ సిద్ధి గణపతి దేవస్థానం భూమిని పరిరక్షిస్తామని గణేష్ దేవస్థానం ఈఓ ఎస్.లావణ్య తెలిపారు. గురువారం పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామ సమీపంలోగల గణేష్ గడ్డ శ్రీ సిద్ధి గణపతి దేవస్థానానికి సంబంధించిన భూమి హద్దులను గ్రామ పెద్దలతో కలిసి ఆలయ ఈఓ లావణ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ లావణ్య మాట్లాడుతూ ఆలయ భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆలయ భూమి ఆలయ అభివృద్ధి కోసం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు చేపడుతున్నామన్నారు. శ్రీ సిద్ధి గణపతి దేవాలయం అభివృద్ధికి భక్తులు, ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల సలహాలు, సూచనలతో దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-మునిపల్లి

సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రాజేష్ నాయక్ అన్నారు. మండలంలోని స్థానిక లింగంపల్లి గురుకుల కళాశాల, పాఠశాలలో విద్యార్థులకు గురువారం సైబర్ నేరాలపై పలు విషయాలపై సూచనలు చేస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేష్ నాయక్ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ల ద్వారానే ఎనభై శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్ ఎక్కువగా వాడకూడదన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు, కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు చెప్పరాదన్నారు. తెలియని యాప్, మెసెజ్‌ల లింక్‌లపై టచ్ చేయరాదని సూచించారు. ఒక వేళ ఓపెన్ చేసినా, టచ్ చేసినాసైబర్ నేరగాళ్ళు మన ఫోన్, కంప్యూటర్లు హ్యాక్ చేసి డాటా మొత్తం సేకరిస్తారన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930కి ఫోన్ చేయాన్నారు. అలాగే బాలికలపై అత్యాచారాలకు పాల్పడటం, బాల్య వివాహాలు చేయడం, వారిని ప్రోత్సహించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురభి చైతన్య ఉపాధ్యాయ బృందం, మునిపల్లి పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యను సీఎం పరిష్కరించాలి

- అసెంబ్లీలో ముదిరాజ్‌ల ప్రస్తావించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు
- రాష్ట్ర ముదిరాజ్ సంక్షేమ సమితి కన్వీనర్ బానిస నారాయణ ముదిరాజ్



నవతెలంగాణ-జోగిపేట

ముదిరాజ్ బిసి-డి నుంచి బీసీ ఏ రిజర్వేషన్ అంశాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు చర్చకు తీసుకు రావడం అభినందనీయమని రాష్ట్ర ముదిరాజ్ సంక్షేమ సమితి కన్వీనర్ బానిస నారాయణ ముదిరాజ్ అన్నారు. గురువారం ఆయన జోగిపేటలో 'నవ తెలంగాణ'తో మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా బీసీఏ రిజర్వేషన్ అంశాన్ని కాలయాపన చేస్తూ వస్తున్నారన్నారు. అసెంబ్లీలో చర్చకు రావడానికి ముదిరాజ్ సంక్షేమ సమితి చేపడుతున్న కార్యక్రమాలే నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీలు బండ ప్రకాష్, తీన్మార్ మల్లన్న, కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే లు కేటీఆర్, వాకిటి శ్రీహరి, జీవన్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, వివేకానంద గౌడ్‌లు ముదిరాజ్ అంశం పైన మాట్లాడారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో ముదిరా జ్‌ల అంశంపైన అనేక సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముదిరాజ్‌లు విద్యాపరంగా, నిరుద్యోగులుగా, రాజకీయంగా వెనుకబాటుకు గురిచేసిన వారికి ఈ చర్చ కనువిప్పు కలగాలన్నారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ముదిరాజ్ కులస్తులకు ఇచ్చిన హామీ ప్రకారం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలోపే బీసీఏ అంశాన్ని పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్‌ల సమస్య పరిష్కారమైతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులు కాంగ్రెస్ పార్టీకి విజ్ఞతగా ఉంటారని ఆయన హామీనిచ్చారు. రాష్ట్రంలోని ప్రజలకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

విలేకరిపై దాడి చేసిన మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-జోగిపేట

అక్రమ బియ్యం మాఫియా జోగిపేట సాక్షి, వి6 మీడియా విలేఖరులపై దాడి చేయడం హేయమైన చర్య అని, ఈ దుర్ఘటన జర్నలిజంపై గొడ్డలి వేటని టీయూడబ్ల్యూ జె (హెచ్) ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు యోగానంద రెడ్డి అన్నారు. గురువారం సంగారెడ్డిలోని డిఎస్పీ కార్యాలయంలో డిఎస్పి సత్తయ్యను కలిసి అందోల్ జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. గురువారం ఆందోల్ మండలం సంగుపేట శివారులో రేషన్ బియ్యాన్ని అక్రమంగా బులేరా వాహనంలో యదేచ్ఛగా తరలిస్తున్న దృశ్యాన్ని ఆందోల్ వి6 విలేఖరి అనిల్ చారి చిత్రీకరిస్తుండగా అక్కడికి బియ్యం మాఫియా గుండాలు దానిష్ పటేల్, ఎండి షకీల్, పుట్నాల ఆశం, ఇలియాస్ అనే వ్యక్తులు కార్లో వచ్చి అందులో ఉన్న లాఠీలతో కక్ష్య పూరితంగా ఇద్దరు విలేకరులపై మూకుమ్మడి దాడి చేశారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. అందులో సాక్షి టివి విలేకరి జంగం శ్రీనివాస్‌పై కర్రలతో విచక్షణారహితంగా కొట్టడంతో విలేకరి ఎడమ చెయ్యి విరిగిపోయిందని, మొఖంపై గాయాలయ్యాయి. ఈ విషయం ఎక్కడైనా చెబితే చంపేస్తామంటూ బెదిరిస్తూ గుండాయిజం చెలాయించారని తెలిపారు. ఈ ఘటనపై బాధితులు జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై జోగిపేట ఎస్.ఐ పాండు దర్యాప్తు చేపట్టారు. సాక్షి విలేకరిపై దాడికి పాల్పడ్డ నిందితులపై కేసు నమోదు చేశారు. అనంతరం ఆందోల్ జర్నలిస్టులు స్పందిస్తూ ఈ ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి డిఎస్పీ సత్తయ్య గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కర్రలతో దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని విలేకరుల బృందం వినతి పత్రంలో డిమాండ్ చేశారు. దీనిపై డిఎస్పి సానుకూలంగా స్పందించి నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జోగిపేట విలేకరులు పడిగేల భగత్, హెచ్ ప్రదీప్ గౌడ్, సంజీవ్ కుమార్, కాశీనాథ్, శివ రత్నం, అనిల్ చారి, దిగంబర్, సందీప్ కుమార్, రాజు, మధు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ఆందోల్ మల్లేశం, దళిత సంఘాల నాయకులు జంగం మహేష్ మొగులయ్యకరుణాకర్, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో..

నిందితులను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత సంఘాల ఆధ్వర్యంలో గురువారం జోగిపేట ఎస్సై పాండుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ఆందోల్ మల్లేశం, జిల్లా కార్యదర్శి దాసరి దుర్గయ్య మాల మహానాడు పట్టణ అధ్యక్షుడు పెండా గోపాల్, కేవీపీస్ డివిజన్ కార్యద్శి విద్యాసాగర్, సాహసం జిల్లా నాయకులు పద్మారావు, మాల మహానాడు ఆందోల్ మండల అధ్యక్షులు బహుజన ప్రసాద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిని ప్రతి గ్రామంలో అధికారికంగా నిర్వహించాలి

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతివేల మాణిక్

నవతెలంగాణ-సంగారెడ్డి

ఏప్రిల్ 14న జరిగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని అన్ని గ్రామాల్లో అధికారికంగా నిర్వహించాలని కోరుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాటం (కెవిపిఎస్) సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధురికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ ఏప్రిల్ 14వ తేదీన ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో, బస్తీలలో ప్రభుత్వమే అధికారికంగా అన్ని రకాల ఏర్పాట్లు చేసి ఘనంగా నిర్వహించాలన్నారు. రాజ్యాంగం, కుల వివక్షత, అంటరానితనం వంటి వాటిపై చైతన్య పరిచే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ నెలలో జిల్లాలోని ప్రతి మండలంలో పౌర హక్కుల దినం నిర్వహించాలని, అన్ని ప్రభుత్వ శాఖల నుంచి అధికారులందరూ పాల్గొనే విధంగా ఆదేశాలివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శివకుమార్, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రమేష్ గౌడ్ లు పాల్గొన్నారు.



అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



నవతెలంగాణ-టేక్మాల్

అనుమానస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన టేక్మాల్‌లో గురువారం తెల్లవారుజామున రెండు గంటలకు జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం ప్రతిరోజు లాగే సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో మద్యం సేవించడానికి వెళుతున్నానని ఇంటిలో చెప్పి వెళ్లిన పోచమ్మ తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో పోచమ్మ కుటుంబ సభ్యులు తెలిసిన వాళ్లకు ఫోన్లు చేసినా ఫలితం లేకపోవడంతో, చుట్టుపక్కల వారికి తెలపడంతో, ఇరుగుపొరుగు వారితో కలిసి పోచమ్మ ఆచూకీ కోసం ప్రయత్నించారు. గ్రామానికి చెందిన తిమ్మిగారి మధు పోచమ్మ ఇద్దరు కలిసి ధనురా రోడ్డు వైపు వెళ్తున్నారని చెప్పడంతో అటువైపు వెతకగా, టేక్మాల్ కట్టేల మిషన్‌కు ఎదురుగా ఉన్న పొలంలో పోచమ్మ విగత జీవిగా పడి ఉండడంతో పోలీసులకు, గ్రామస్తులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి శవాన్ని పరిశీలించి, పంచనామ నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారని చెప్పారు. పోచమ్మ మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతురాలి కూతురు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన హౌసింగ్ పీడీ




నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పనులను గురువారం హౌసింగ్ పిడి మాణిక్యం పరిశీలించారు. ఈ మేరకు మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో రాజిరెడ్డి, గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మిలు ఉన్నారు.

రూల్స్ మీకే-నాకు వర్తించవు





- రామాయంపేట సిడిపిఓ తీరుపై విమర్శలు..?
- మూడు రోజులు గైర్హాజరైన, ఐసిడిఎస్ ఆఫీస్ లో సమాచారం లేదు
- సమాచార హక్కు చట్టం ఉల్లంగన..
- ఆరేళ్లకు పైగా ఒకే స్థానంలో ఉద్యోగంపై చర్చ..?

నవతెలంగాణ-రామాయంపేట

తన పరిధిలో విధులు నిర్వహిస్తున్న సుమారు వందలాది ఉద్యోగులు, సిబ్బందికి, సమయపాలన పాటించాలని, రూల్స్ పాటించాలని ఆదేశాలిస్తూ, విధులు నిర్వహించే ఆ అధికారి, తాను మాత్రం సమయపాలన పాటించకుండా కార్యాలయానికి వస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంగన్వాడి పాఠశాలలు ఎలా నిర్వహించాలో ఆదేశాలిస్తూ, తన కార్యాలయంలో మాత్రం, కనీసం సమాచార హక్కు చట్టం బోర్డును కూడా సరైన రీతిలో ఉంచలేకపోవడం, తాను విధులు ఎలా నిర్వహిస్తుందో, తన నిర్లక్ష్యపు పని తీరుకు అద్దం పడుతుంది. రూల్స్ పాటించే విషయంలో సిబ్బంది పట్ల కచ్చితంగా ఉండే ఆమె, ఆ రూల్స్ మీకే - నాకు కాదు అన్న విధంగా పనిచేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రామాయంపేట ఐసిడిఎస్ కార్యాలయంలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీఓ) స్వరూప రాథోడ్‌పై గత కొంతకాలంగా విధుల పట్ల నిర్లక్ష్యపు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ఆరు సంవత్సరాలకు పైగా ఈ ప్రాంతంలో సీడీపీఓగా విధులు నిర్వహిస్తున్న ఆమె, కార్యాలయ సమయపాలనలో తీవ్రమైన లోపాలున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం ఉదయం 11 గంటల తర్వాత 'నవ తెలంగాణ' విలేకరి కార్యాలయాన్ని సందర్శించగా, సీడీపీఓ అప్పటికి విధులకు హాజరు కాలేదు. ఈ విషయమై కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌ను ప్రశ్నించగా, ఆమె ఎందుకు హాజరు కాలేదో తనకు సమాచారం లేదని తెలిపారు.

మూడు రోజులుగా కార్యాలయానికి సీడీపీఓ గైర్హాజరు

గత మూడు రోజులుగా సీడీపీఓ కార్యాలయానికి రాలేదని పౌర సమాచార అధికారి, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు వెల్లడించారు. ఈ విషయాన్ని జిల్లా అధికారి హైమావతిని ఫోన్‌లో సంప్రదించగా, ఈ నెల 25న జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశానికి రామాయపేట సిడిపిఓ హాజరైనట్లు తెలిపారు. 26వ తేదీన వ్యక్తిగత కారణాల వల్ల విధులకు హాజరు కాలేదని, ఈ విషయమై తనకు సమాచారం అందించినట్లు వివరించారు. అయితే, గురువారం ఆమె ఎందుకు కార్యాలయానికి రాలేదనే విషయంపై తనకు స్పష్టత లేదని పేర్కొన్నారు. మరోసారి కార్యాలయాన్ని సందర్శించగా, సిడిపిఓ దంతేపల్లి ప్రాంతంలోని గిరిజన తండాకు క్షేత్రస్థాయి పరిశీలన కోసం వెళ్లినట్లు తమ గ్రూప్‌లో పోస్ట్ చేసిందని సీనియర్ అసిస్టెంట్ నాగరాజు తెలిపారు.

ఎక్కడికి వెళ్లినా కార్యాలయంలో సమాచారం ఉండాలి

డి డబ్ల్యు సీఓ హైమావతి

కార్యాలయ అధికారి నేరుగా క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్లినా, కార్యాలయ ఇతర ఉద్యోగులకు తప్పనిసరిగా సమాచారం ఉండాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి హైమావతి తెలిపారు. కాగా గత మూడు రోజులుగా కార్యాలయానికి రాని రామాయంపేట సిడిపిఓ, ఈనెల 25న జిల్లా సమావేశాలకు వెళ్లిన, వ్యక్తిగత కారణాలతో జిల్లా అధికారి అనుమతి మేరకు 26న విధులకు హాజరు కాకపోయినా, గురువారం తన ఇంటి నుంచి నేరుగా క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్లినా రామాయంపేట సిడిపిఓ కార్యాలయంలోని సిబ్బందికి, ఇతర ఉద్యోగులకు ఎలాంటి సమాచారం లేకపోవడం వివాదాస్పదంగా మారింది.

ఆరు సంవత్సరాలకు పైగా ఒకే స్థానంలో ఉద్యోగం


రామాయపేట సిడిపివోగా విధులు నిర్వహిస్తున్న స్వరూప రాథోడ్ గత ఆరు సంవత్సరాలకు పైగా రామాయంపేటలోనే విధులు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఒకే ప్రాంతంలో ఒక అధికారి ఇన్ని సంవత్సరాల పాటు పనిచేయడం సాధారణం కాదని, దీనిపై స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ప్రాజెక్టు పరిధి సమావేశంలో అంగన్వాడి సిబ్బంది పట్ల ఆమె వ్యవహరించిన తీరు చర్చనీయాంశం కాగా, ఒకే ప్రాంతంలో ఇన్నేళ్లుగా విధులు నిర్వహించడం మరో చర్చకు తెరలేపింది.

సమాచార హక్కు చట్టం ఉల్లంఘన?

సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ప్రకారం, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార అధికారుల వివరాలు బోర్డు మీద స్పష్టంగా ప్రదర్శించాలి. అయితే, రామాయంపేట ఐసిడిఎస్ కార్యాలయంలో బోర్డు ఉన్నప్పటికీ, అందులో సిడిపిఓ స్వరూప రాథోడ్ పేరు కనిపించడం లేదు. కొంతమంది సమాచార అధికారుల పేర్లు కనిపించినా, అప్పిలేట్ అధికారిగా వ్యవహరించాల్సిన సిడిపిఓ పేరు లేకపోవడం ఆమె నిర్లక్ష్య వైఖరిని సూచిస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇతర అధికారుల పేర్లు ఉన్నా అవి కూడా స్పష్టంగా లేకపోవడం గమనార్హం.

ఒకే అధికారి దీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో కొనసాగడం, కార్యాలయ సమయపాలనలో లోపాలు, సిబ్బందికి సమాచారం ఇవ్వకపోవడం వంటి అంశాలపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సిడిపిఓ స్వరూప రాథోడ్ విధి నిర్వహణలో స్పష్టత, బాధ్యత లేకపోవడం ఈ ప్రాంతంలో ఐసిడిఎస్ సేవలపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి, సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.


జాతర ఉత్సవాలకు ముస్తాబైన భర్మస్వామి ఆలయం



నవతెలంగాణ-శివ్వంపేట

ప్రతి సంవత్సరం ఉగాది పర్వదినం రోజున జరిగే జాతర ఉత్సవాలకు పిల్లుట్ల శ్రీభర్మస్వామి దేవాల యం అందంగా ముస్తాబ వుతుంది. ఆలయ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పిల్లి శివకుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో జాతర ఉత్సవాలను మరింత బ్రహ్మాండంగా నిర్వహించేందుకు పనులు చకచక కొనసాగిస్తున్నారు. స్వామివారి ఆలయాన్ని రంగులతో అందంగా ముస్తాబు చేశారు. నర్సాపూర్, వెల్దుర్తి ప్రధాన రహదారిపై పిల్లుట్ల చౌరస్తాలో ఉన్న ఆలయ ముఖ ద్వారానికి రంగులు వేయించి అందంగా తీర్చిదిద్దుతున్నారు. జాతర ఉత్సవాలకు విచ్చేయనున్న ముఖ్య అతిథులకు ఆలయ కమిటీ చైర్మన్ శివకుమార్ ఆధ్వర్యంలో ఆహ్వానాలను సైతం అందజేశారు. జాతర ఉత్సవాలకు తరలి వచ్చే స్వామివారి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


యాదగిరి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-తూప్రాన్

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు అబోతుపల్లికి చెందిన పొందేటి యాదగిరి అప్పుల బాధతో, ఆర్థిక సమస్యలతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకొన్న మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ గురువారం ఉదయం యాదగిరి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మృతుని భార్య మహేశ్వరికి, కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని, 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.పి, పి.ఎం.పి డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ అప్సర్ భాయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్తపల్లి నర్సింగరావు, గుర్రం రాములు, గుడిసె సిద్ధిరాములు, పోడేటి స్వామి, తదితరులు ఉన్నారు.


రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-నిజాంపేట

రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీవో రాజిరెడ్డి తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీ వరకు మీసేవ/ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఎస్సీ ఎస్టీ, బిసి మైనార్టీ, ఈ బీసీ (ఈడబ్ల్యూఎస్) దరఖాస్తుదారులు, ఆన్లైన్ దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు/ఆదాయ సర్టిఫికెట్, కులం సర్టిఫికెట్ జిరాక్స్‌లు, ఫోటో జత చేసి ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

కొడేకల్ గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని కొడేకల్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నారు. గురువారం సీసీ రోడ్డు పనులను స్థానిక హనుమాన్ దేవాలయం నుంచి ప్రధాన రహదారి గుండా గ్రామపంచాయతీ వైపు వేశారు. సీసీ రోడ్డు వేయడం పట్ల గ్రామ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోళ్ల వీరారెడ్డి, మాజీ సర్పంచ్ రాజేశ్వర్ గౌడ్, ఎలీషా, శ్రీనివాస్ రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాణిక్యం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైపాల్ రెడ్డి, జగన్ రెడ్డి, నరసయ్య, భోజి రెడ్డి, మొగులయ్య, మహేందర్ రెడ్డి, నారాయణరెడ్డి, సంజీవులు, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్, ఆశయ్య, మల్లేశం, సిరాజ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో ఘనంగా స్కిల్ దర్బార్



నవతెలంగాణ-సంగారెడ్డి

పట్టణంలోని స్థానిక శాంతి నగర్‌లో గల సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో స్కిల్ దర్బార్ కార్యక్ర మం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ డైరెక్టర్ ఈ.విజయ్ కుమార్ రెడ్డి, అఖిల్ సుప్పాల, గౌరవ అతిథిగా విచ్చేసిన మధులత బదినిని , ప్రోగ్రాం సక్సెస్ మేనేజర్, అకాడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఈ.అరుణా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ లక్కిశెట్టి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు సవరించుకోవడం, ఎదుటివారిని ఎలా స్వాగతించాలి, ఎలా మాట్లాడితే ఆత్మగౌరవం పెరుగుతుందనేది తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఎవరైనాసరే తాను చేసే పనిని, తన ఎదుగుదలను తక్కువ అంచనా వేయకూడదన్నారు. ప్రతి పనిని ప్రణాళిక ప్రకారం చేయడం, చిన్నప్పటినుండే అలవాటు చేసుకొని సమాజంలో విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థులు తయారుచేసిన నమూనాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పంచాంగ శ్రవణం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఉగాది పర్వదినం పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలోని చైతన్య నగర్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించే పంచాంగ శ్రవణం ఆహ్వాన పత్రికను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ప్రతి ఏటా ఉగాది పండగ పురస్కరించుకొని చైతన్య నగర్ హనుమాన్ దేవాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించడం ఆనవాయితిగా వస్తుందని తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలందరూ పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నాయకులు రామచంద్రా రెడ్డి, చంద్ర శేఖర్, శ్రీ రాములు, శీనయ్య, మల్లేష్ యాదవ్, శంకర్, అశోక్, వెంకటేష్, రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

త్రాగునీరు రాక అవస్థలు పడుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-జిన్నారం

త్రాగునీరు, వాడుకనీరు రాక అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 15 రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రాక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు జిన్నారం మండల పరిధిలోని జంగంపేట గ్రామ ప్రజలు. గురువారం ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ సుమారు నెలరోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో బోర్ వాటర్ అందిస్తున్నప్పటికీ, అక్కడక్కడ నీరు అందడం లేదన్నారు. పలువురు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్న విషయం విధితమేనన్నారు. అయినప్పటికీ మండల ఉన్నతాధికారులకు విషయాన్ని చేరవేసి సమస్య పరిష్కార దిశగా వెంటనే చర్యలు చేపడతామని సూచించారు

ఆన్లైన్ మోసాలతో రైతుల భూములకు ఎసరు




నవతెలంగాణ-నిజాంపేట

ఆన్లైన్ మోసాలతో అకౌంట్‌లో నుంచి డబ్బులు పోయేటివి కానీ ప్రస్తుతం ఆన్లైన్లో నుంచి రైతుల భూములు కూడా ఎగిరిపోతున్నాయి. మండల పరిధిలోని కాసింపూర్ గ్రామానికి చెందిన జీడి నారా గౌడ్‌కు 1531 సర్వేనంబర్‌లో ఉన్న 6 గుంటల భూమి ఆన్లైన్లో నుంచి ఎగిరిపోయింది. కల్వకుంట గ్రామానికి చెందిన హెూటల్ రామస్వామికి చెందిన భూమి 1 గుంట భూమి ఎగిరిపోయింది. బాధితులు గురువారం తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ రమ్యశ్రీ కి దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తాము ఎవరికి భూములు అమ్మలేదని ఆన్లైన్లో చూస్తే వేరే వారి పేరు మీద వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తహసిల్దార్ కార్యాలయంలో జరుగుతున్న వా? కలెక్టర్ కార్యాలయం లోనా? సెక్రటేరియట్‌లోనా? ఎక్కడ జరుగుతున్నాయో ఏమో అర్థం కావడం లేదని బాధితులు వాపోయారు. ఈ విషయంపై డిప్యూటీ తహసిల్దార్ రమ్యశ్రీని వివరణ కోరగా అవును ఇటువంటి విషయాలు జరుగుతున్న మాట వాస్తవమేనని, ఇవి ఎక్కడ జరుగుతున్నాయో ఏమో అర్థం కావడం లేదన్నారు. బాధితులకు ఇట్టి భూమి ఎవరి పేరు మీద అయితే పడ్డదో వారిని కలెక్టర్ ఆఫీసులో పిలిపించుకొని విచారణ జరపనున్నామని తెలిపారు. ఆ విధంగా బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు.

నా భూమి నాకు పాసుబుక్కులో ఎక్కించాలి.

కొత్త పాస్ బుక్కులు ఇచ్చినప్పుడు భూమి పాస్‌బుక్‌లో ఉండేదని ప్రస్తుతము ఆన్లైన్లో చూసేవరకు రావడంలేదని వేరే వారి పేర్ల మీద వస్తుందని, ఇలా ంటి తప్పిదాలు ఏ విధంగా జరుగుతున్నాయో ఏమో అర్థం కావడం లేదు. నా యొక్క 6 గుంట ల భూమి పాసుబుక్‌లో ఎక్కే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.



జీడి నారా గౌడ్, కాసింపూర్ గ్రామవాసి

భూమి ఎక్కించేది ఎవరు?

ఆన్లైన్లో నుంచి భూములు ఎగిరిపోవడంతో తిరిగి మరలా ఎక్కించేది ఎవరు. కల్వకుంట శివారులో ఆన్లైన్లో నుంచి నాది 1 గుంట భూమి ఎగిరిపోయింది. అధికారులు వెంటనే స్పందించి నా యొక్క భూమి నాకు వచ్చే విధంగా కృషి చేయాలి.



హెూటల్ రామస్వామి, కల్వకుంట గ్రామవాసి

కాళ్ళకల్లో తైబజార్ వేలం వాయిదా

- నూతన భవనంలోకి మారేవరకు వాయిదా వేయాలన్న గ్రామస్తులు



నవతెలంగాణ-మనోహరాబాద్

నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనంలోకి మారి అక్కడి నుంచి పాలన మొదలైన తర్వాతే గ్రామంలో తైబజార్ వేలంపాట నిర్వహించాలని, అప్పటివరకు వేలంపాటలను వాయిదా వేయాలంటూ గ్రామస్తులు తెలపడంతో అధికారులు తైబజార్ వేలంను వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కాళ్లకల్‌లో గురువారం ఎంపీడీవో కృష్ణమూర్తి అధ్యక్షతన కార్యదర్శి ప్రియాంక ఏర్పాటు చేసిన తై బజార్ వేలం కార్యక్రమానికి సర్పంచ్ నత్తి మల్లేష్ ముదిరాజ్ హాజరయ్యారు. దాంతో వేలంపాట కార్యక్రమానికి హాజరైన గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం అసంపూర్తిగానే ఉండిపోయిందని పేర్కొన్నారు. నిర్మాణం చేపట్టి రెండు మూడు సంవత్సరాలు పూర్తయినా అసంపూర్తిగానే ఉండడంతో అద్దె భవనంలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఇప్పటివరకు లక్షల రూపాయల అద్దెను చెల్లించడం జరిగిందని పేర్కొన్నారు. బుధవారం జరిగిన గ్రామసభలో భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌కు రూ.30 లక్షల వరకు ఇవ్వాలని తీర్మానం చేశారని నూతన భవనంలో పంచాయతీ కార్యాలయం కొనసాగే విధంగా పై అంతస్తులో పనులను పూర్తి చేసి ఇచ్చేవరకు డబ్బులను ఇవ్వ వద్దంటూ గ్రామస్తులు తెలిపారు. కార్యాలయం కొనసాగే విధంగా చిన్నచిన్న పనులు చేసి ఇచ్చేవరకు డబ్బులు ఇవ్వద్దని లేదా పనులు చేపట్టే విధంగా అధికారులు కాంట్రాక్టర్‌తో చర్చించి పనులు చేసే విధంగా చూడాలని గ్రామస్తులు ఎంపీడీవో కృష్ణమూర్తిని కోరారు. నూతన భవనంలో కార్యాలయం కొనసాగే వరకు తైబజార్ వేలంపాటను వాయిదా వేయాలంటూ గ్రామస్తులు కోరారు. దాంతో ఎంపీడీవో కృష్ణమూర్తి ఆదేశాలతో కార్యదర్శి ప్రియాంక వేలంపాటను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. తిరిగి ఈ నెల 29న వేలంపాటను నిర్వహించనున్నట్టు కార్యదర్శి ప్రియాంక పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదంశెట్టి వెంకటేశం గుప్తా, టీవీ రావు, గోపాల్ ముదిరాజ్, ఇంద్రసేన, నర్సింలులతోపాటు అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహెూత్సవం




నవతెలంగాణ -వెల్దుర్తి

మండల పరిధి బస్వాపూర్ గ్రామప ంచాయతీ పరిసరాల్లో ఉన్న మల్లన్న గుట్టలో సహజ సిద్ధంగా వెలిసిన శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి దేవాలయ 48వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనం గా జరిగాయి. ప్రధాన దేవత మూర్తులకు ప్రత్యేక పూజలు, శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహెూత్సవం, పల్లకి సేవ, బోనాలు, సాంస్కృతిక కార్య క్రమం, భగవాన్ నామ స్మరణ, అఖండ భజన వంటి కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పౌరోహిత్య శంభుని లక్ష్మీకాంత శర్మ శంభుని పని రాజ్ శర్మ, రఘువీరశర్మ రామదత్త శర్మ వెంకటేశ్వర శర్మ వారి ఆశీస్సులతో ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణ మహెూత్స వాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. భక్తులు బస్వాపూర్ కుకునూర్ వెల్దుర్తి పరిసరాల ప్రాంతాల ప్రజలు తండోప తండాలుగా తరలివచ్చి కళ్యాణ మహెూత్సవంలో పాల్గొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆశీస్సులు పొందడం జరిగిందని భక్తులు తెలిపారు. భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కలగకుండా నీటి వసతి, అన్నదాన వసతి సౌకర్యాలు కల్పించడం జరిగింది. భగవంతుని దివ్య ఆశీస్సులతో రానున్న వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ఇంటిల్లిపాదిన సుఖసంతోషాలతో తులతూగాలని కోరుకున్నామన్నారు ఆలయ కమిటీ నిర్వాహకులు తలారి జగ్గా అశోక్ గౌడ్ మల్లేష్ సింహం రాములు మల్లేష్ నర్సింలు తోపాటు మరికొంతమంది ఉన్నారు.

రాయితీపై వ్యవసాయపరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం

- రేపే దరఖాస్తుకు చివరి తేదీ
- వ్యవసాయ అధికారిని స్రవంతి



నవతెలంగాణ-మనోహరాబాద్

రాయితీపై వ్యవసాయ పరికరాలను అందించడానికి రైతులు ఈ నెల 29వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారిని స్రవంతి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. పట్టా పాస్ పుస్తకం కలిగిన ఎస్సీ, ఎస్టి, జనరల్ మహిళలు మాత్రమే అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టి రైతులకి 50% రాయతి జనరల్ రైతులకి 40% రాయతి ఉంటుందని పేర్కొన్నారు. ఒక లక్ష రూపాయల లోపు లబ్ది పొందు రైతులు కనిసం 1 ఎకరం లోపు వరకు భూమి కలిగి ఉండాలని, ఒక లక్ష లేదా అంతకన్నా ఎక్కువ లబ్ది పొందాలను రైతులు ఖచ్చితంగా 1 ఎకరం భూమి కలిగి ఉండాలని సూచించారు. బ్యాటరీ స్ప్రేయర్ జనరల్-03, ఎస్టిలకు-01, పవర్ స్ప్రేయరు జనరల్ కు రెండు, ఎస్సీలకు-01 రోటవేటర్ జనరల్‌కు ఒకటి, డిస్క్ హ్యారో, కల్టివేటర్లు, ఎం బి ప్లగ్గు,, కేజీ వీల్స్, రూటోపడ్లర్స్ జనరల్‌కు ఒకటి ఉన్నట్టు పేర్కొన్నారు. ధరకాస్తు చేసుకున్న అనంతరం మండల స్థాయిలో నియమించిన కమిటీ సమక్షంలో లబ్దిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే రైతులు తప్పనిసరిగా ధరకాస్తు ఫారంతో పాటు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్‌కు సంబంధించిన పరికరాలకి ఆర్ సి జీరక్స్,ఒక పాస్పోర్ట్ సైజు ఫోటో, నేల సారంకు సంబంధించిన సాయిల్ హెల్త్ కార్డు తప్పనిసరని, దాంతోపాటు బ్యాంక్ పాసు పుస్తకం తప్పనిసరిగా జతచేయాలని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఈ నెల చివర్లో ముగిస్తున్నందున ఈ నెల 29 వ తారీఖు వరకు దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే లబ్ది పొందుతారని తెలిపారు. కావున త్వరితగతిన ధరకాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారిని స్రవంతి తెలిపారు.

ఘనంగా ఆవుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు

- కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవ చేస్తా
- నియోజకవర్గం ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

తనను నమ్ముకున్న కార్యకర్తల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గం ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ కళ్యాణ మండపంలో కాంగ్రెస్ కార్యకర్తల మధ్య రాజిరెడ్డి అభిమానుల మధ్య టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి తన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు తీసుకువచ్చిన భారీ కేకును కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలు ఉద్దేశించి రాజిరెడ్డి మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలకు భారీగా తరలివచ్చిన కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానన్నారు. అనంతరం వివిధ మండలాల నుంచి భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, రాజిరెడ్డి అభిమానులు, రాజి రెడ్డిని శాలువాలతో పూలమాలతో సన్మానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా నర్సాపూర్ పట్టణంలోని శ్రీ మరకత మల్లికార్జున స్వామి ఆలయంలో రాజిరెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి డీజే పాటల, కోలాటాల మధ్య భారీ ర్యాలీగా నర్సాపూర్ పట్టణంలో కొనసాగింది, నర్సాపూర్ పట్టణంలో బస్టాండ్ ఎదురుగా భారీ గజమాలను క్రేన్ సహాయంతో రాజిరెడ్డి మెడలో వేసి ఘనంగా సత్కరించారు. అక్కడ నుంచి సాయి కృష్ణ ఫంక్షన్ వరకు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.

ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

టిపిసిసి ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి జన్మదినం సందర్భంగా సాయి కృష్ణ కళ్యాణ మండపంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు హరీష్ వర్ధన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ మాచునూరి రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేశం, నాయకులు కరుణాకర్ రెడ్డి, నవీన్ గుప్తా, శ్రీనివాస్ గుప్తా, రిజ్వాన్, రెడ్డిపల్లి అశోక్ గౌడ్, రామా గౌడ్, సురేష్ నాయక్, ఆంజనేయులు గౌడ్, మణిదీప్, దొంతి రవి, మాజీ కౌన్సిలర్ నాగేష్, హరీష్ వర్ధన్, సందీప్, ఎద్దు మల్లేష్ యాదవ్, సత్యం, సుజాత, లలితా నర్సింగ్, కమలాపూర్ సింగ్, ఉదయ్ కుమార్, మల్ల గౌడ్, వినోద కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రక్తంతో రాజిరెడ్డి చిత్రపటం..

టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు హర్షవర్ధన్ తన రక్తంతో రాజిరెడ్డి చిత్రపటాన్ని వేయించి, ఈ చిత్రపటాన్ని హర్షవర్ధన్ రాజిరెడ్డికి అందజేశాడు.

నవతెలంగాణ- వెల్దుర్తి

పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద మండల కాంగ్రెస్ నాయకులు జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్ నరసింహారెడ్డి ఫిషర్ మెన్ కార్యదర్శి తలారి మల్లేష్ పట్టణ అధ్యక్షుడు మల్లేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జన హృదయ నేత నియోజకవర్గ అభివృద్ధికి కంకణ బద్ధులై పనిచేస్తున్న మహానేత అందరికి అందుబాటులో ఉండి ఏ ఆపద వచ్చినా తీర్చే నాయకుడని కొనియాడారు. మరిన్ని జన్మదిన ఆయురారోగ్యాలతో జరుపుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రతి కార్యకర్తకు గుర్తుండిపోయే విధంగా ఆప్యాయతగా పలకరిస్తూ అక్కున చేర్చుకొని నీకు ఏమి ఆపది ఉంది అని తెలుసుకొని ఆపదను తీర్చే మా నాయకుడని అన్నారు. ఇటువంటి నాయకుడు మన మధ్య ఉండడం మన అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గశంకర్ గౌడ్ కృష్ణ అంజా గౌడ్ వెంకటేష్ రవి మహేష్ అశోక్ రాములు తోపాటు మరికొంతమంది ఉన్నారు.

నవతెలంగాణ-శివ్వంపేట

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. నర్సాపూర్, తూప్రాన్ ప్రధాన రహదారిపై భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్త ఆధ్వర్యంలో పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి, గోమారం మాధవరెడ్డి, కరుణాకర్ రెడ్డి నేతృత్వంలో ఆవుల రాజిరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించి, సుమారు 4 వందల బైక్ లతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నర్సాపూం "లో జరిగే పుట్టినరోజు వేడుకలకు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి ఎళ్లారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మండల నాయకులు వారాల గణేష్, చింతల లక్ష్మారెడ్డి, వంజరి కొండల్, మైనార్టీ నాయకులు షేక్ అలీ,గుండ నాగరాజు,బాసంపల్లి ప్రభులింగం, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
4
సిద్దిపేట
శుక్రవారం | 28 మార్చి 2025 | www.navatelangana.com

ఈద్గా గ్రౌండ్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-సిద్ధిపేట



రంజాన్ పండుగ సందర్భంగా గద్ద బొమ్మ వద్ద ఉన్న ఈద్గా గ్రౌండ్‌లో ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మెన్ కడవేర్గు రాజనర్సులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రతి ఏడాది లాగానే పురపాలక సంబంధిత ఏర్పాట్లను చేయడం జరుగుతుందని, పారిశుధ్య పనులు, త్రాగునీరు, టెంట్లు, సౌండ్ సిస్టం వంటి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పురపాలక సంబంధిత ఏర్పాట్లు సంబంధించిన లోపాలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ సూచించారు. మంచి ప్రశాంత వాతావరణంలో పండుగ చేసుకోవాలని అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దమ్మక్కపల్లిలో అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం

-అదుపులోకి తీసుకున్న పోలీసులు

నవతెలంగాణ-కొండపాక





అంబేడ్కర్ విగ్రహ విధ్వంసానికి పాల్పడిన సంఘటన కొండపాక మండలం దమ్మక్కపల్లిలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే దమ్మక్కపల్లి గ్రామంలో బస్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దానిని ఇంకా ఆవిష్కరించలేదు. గ్రామానికి చెందిన జింక తిరుపతి అనే వ్యక్తి గురువారం విగ్రహ గద్దె పైన కూర్చుని కట్టెతో అంబేద్కర్ చేతిని కొట్టాడు. ఇది గమనిస్తున్న గ్రామస్తులు అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిని నానా బూతులు తిడుతూ వారి పైన విరుచుకుపడ్డాడు. కట్టేతో కొట్టడంతో అంబేడ్కర్ విగ్రహం చేయి విరిగింది. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ చేరుకొని తిరుపతిని కిందికి దించి అదుపులోకి తీసుకున్నారు.

ఆగని రోడ్డు ప్రమాదాలు



● గాలిలో కలుస్తున్న ప్రాణాలు

నవతెలంగాణ-గజ్వేల్

జాతీయ, రూరల్ రోడ్లని తేడా లేకుండా రోడ్డు ప్రమాదాలు అదే స్థాయిలో జరిగి రక్తపుటేరులై పారుతుంది. ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. రాజీవ్ రహదారి జిల్లా పరిధిలో ములుగు మండలం వంటిమామిడి వద్ద ప్రారంభమై ఉమ్మడి కరీంనగర్ జిల్లా దేవక్కపల్లి వరకు 92 కిలోమీటర్ల మేరకు రోడ్డు విస్తరించి ఉంది. రోజు ఎక్కడో ఒకచోట ప్రమాదాలు చోటుచేసుకుని రక్తసిక్తంగా మారుతుంది. నిత్యం సగటున 20వేల వాహనాలు రోడ్డు గుండా ప్రయాణిస్తున్నాయి. ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు, కారులు, లారీలు, డీసీఎంలు ఇతర వాహనాల ద్వారా రవాణా సౌకర్యాలు కొనసాగుతున్నాయి. దారి పొడవునా అక్కడక్కడ పోలీస్ స్టేషన్లు ఉన్న వేగం నియంత్రిరించలేకపోతున్నారు. రాజీవ్ రహదారిపై ప్రతి ఏడాది 500 పైగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో 300 మంది వరకు ప్రాణాలు కోల్పోతుండగా మరో రెండు వందల మంది క్షతగాత్రుల్లో మిగులుతున్నారు. ప్రయివేట్ వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులు కూడా ప్రమాదానికి గురవుతున్నాయి. పోలీస్ స్టేషన్లో నమోదవుతున్న కేసుల్లో 40 శాతానికి పైగా రోడ్డు ప్రమాదాలు ఉండటం అందరిని భయానికి గురిచేస్తుంది.

2024 ఏడాదిలో 665 ప్రమాదాల్లో 283 మృతి చెందగా 561 మందికి గాయాలయ్యాయి. 2025 మార్చి 23 వరకు పరిశీలన చేస్తే 77 ప్రమాదాల్లో 38 మంది మృతి చెందగా 55 మంది క్షతగాత్రులుగా మిగిలారు. 2018లో గజ్వేల్ మండలం రిమ్మనగూడ వద్ద డివైడెడ్ దాటి దూసుకెళ్లిన లారీ బస్సును ఢీకొట్టడంతో 13 మంది చనిపోయారు. రిమ్మనగూడ సమీపంలో మరో సంఘటనలో జీపు లారీ ఢీకొన్న సమయంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. గౌరవరం సమీపంలో మలుపు వద్ద దంపతులు ఓ పాప ద్విచక్రంపై వెళుతున్న క్రమంలో హైదరాబాద్ వైపు నుంచి సిద్దిపేటకు వెళుతున్న కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్ను ఢీకొని బైక్‌ని ఢీకొట్టడంతో ముగ్గురు కాలిపోయారు.

రోడ్డు నాణ్యత అంతంతే..

హైదరాబాదు నుంచి రామగుండం వరకు రాజీవ్ రహదారిపై జరుగుతున్న క్రమంలో అప్పటి ప్రభుత్వంపై విమర్శలు రావడంతో రోడ్డు అథారిటీ కమిటీని వేసి లోపాలను గుర్తించారు. అయినా వాటిని సరిచేసిన దాఖలాలు లేవు. అడుగడుగునా రోడ్డు లోపాలు ప్రజలకు శాపాలుగా మారి ప్రమాదాలకు నిలయం అవుతున్నాయి. రోడ్డు లోపాలను సరిదిద్దేందుకు గత ప్రభుత్వంలో రోడ్డు అథారిటీ నివేదిక అందించింది. రూ.800 కోట్లు నిధులు అవసరం ఉన్నాయని నివేదిక ఇంజనీర్లు అప్పటి ప్రభుత్వానికి అందించారు. కానీ ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ఈ రహదారిపై మొత్తం 60 మలుపులు ఉన్నట్లు గుర్తించి వాటిని సరిచేయాలని సూచించారు. అప్పటి ఉమ్మడి శాసనసభ దీనికి నిర్ణయం చేసింది. రాజీవ్ రహదారిపై డివైడర్ ఏర్పాటు చేసిన ప్రమాదాలు ఆగడం లేదు. రోడ్లపై రక్తపుటేరులై పారుతున్నాయి.

రూరల్ రోడ్లల్లో సైతం..

ఇటీవల కాలంలో రూరల్ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు తరచుగా చోటు చేసుకుంటున్నాయి. ఆదివారం గజ్వేల్ నుంచి అమ్మదిపూర్ కొలుగురికి వెళ్లే రహదారిలో లారీ బైకు ఢీకొని ఒకరు మృతిచెందగా ఇద్దరు కాళ్లు చేతులు కోల్పోయారు. అదేవిధంగా గజ్వేల్ పట్టణంలో ఇటీవల ముత్రాజ్పల్లి రోడ్‌లో డివైడర్ను ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. గజ్వేల్ నుంచి తొగుటకు వెళ్లే రోడ్లో సైతం భార్యాభర్తలు మృతి చెందారు. గజ్వేల్ పట్టణంలో బస్సు ఢీకొని మరిముత్యాల చెందిన వృద్ధురాలు ఇటీవల మృతి చెందారు. అదేవిధంగా గజ్వేల్ నుండి చేగుంటకు వెళ్లే రోడ్డులో వరుసగా మూడు ప్రమాదాల్లో ఆరుగురు చనిపోయారు.

పాఠశాలలో పెన్ బ్యాంక్ ఓపెన్ కార్యక్రమం

నవతెలంగాణ-నంగునూరు



మండలంలోని గట్ల మల్యాల ప్రాథమిక పాఠశాలలో గురువారం పెన్ బ్యాంక్ ఓపెన్ కార్యక్రమం నిర్వహించారు. దీని ఉద్దేశం ప్రతి విద్యార్థికి ఒక పెన్ ఇచ్చారు. అది అయిపోగానే ఈ బ్యాంకులో వేసి కొత్త పెన్‌ను తీసుకునేలా ఏర్పాటు చేశారు. పెన్సిల్, షార్పనర్, రేసర్ ఇలా వారికి కావలసిన వస్తువులు అందుబాటులో నిల్వ చేశారు. దీనివల్ల పిల్లల్లో ప్యాకెట్ మనీ నిర్వహించడంతో పాటు క్రమశిక్షణ అలబడుతుందని అతిథులు పేర్కొన్నారు. ఒక సిస్టం అలవాటు చేయ బడుతుందని, నైతిక ధర్మాన్ని పాటించిన వారవుతారు. వారికి కావాల్సింది అడిగి తీసుకునే సామర్థ్యం డెవలప్ అవుతుందని తెలిపారు.

నేత్రాల సేకరణ

నవతెలంగాణ-సిద్దిపేట



అలయన్స్ క్లబ్ సిద్దిపేట జిల్లా జోన్ చైర్మెన్ మద్ది మల్లేశం సతీమణి అన్నపూర్ణ (70) అనారోగ్య కారణంతో మరణించగా, వీరి కుటుంబ సభ్యుల సహకారంతో నేత్రాలు సేకరించి, ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్‌కు పంపించినట్లు అలయన్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మెన్ ఆత్మ రాములు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. వీరి నేత్రాలు మరో ఇద్దరి జీవితాలకు వెలుగు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

నవతెలంగాణ-సిద్దిపేట



కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో సిద్దిపేట నియోజకవర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ ఆదేశాలు మేరకు సీఎం సహాయ నిధి రూ.39వేల చెక్కును లబ్ధిదారులు పరమేశ్వరి కుటుంబ సభ్యులకు అందించినట్లు రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నంగునూరు మండల అధ్యక్షులు తప్పటి శంకర్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వహాబ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు షాన్ పాషా, జనార్ధన్ రెడ్డి, అనిల్, ప్రతాప్, రాకేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కోన కార్పస్ చెట్లు తొలగించాలని వినతిపత్రం

నవతెలంగాణ-సిద్ధిపేట



సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి పూజల హరికృష్ణ ఆదేశాల మేరకు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణన్న ఆధ్వర్యంలో పట్టణంలోని పర్యావరణానికి నష్టం కలిగిస్తున్న కోన కార్పస్ అనే చెట్లను తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌కి వినతి పత్రం అందించినట్లు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు అజ్మత్ అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ రాకేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు సాదుల సాయి ప్రతాప్, పుల్లూరు యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులు

నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్



మెదక్ ఎంపీ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ ఎంఆర్ఆర్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులు గురువారం అందజేశారు. అందులో గజ్వేల్ మండలం బంగ్లా వెంకటపూర్ గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రథమ బహుమతి కుమ్మరి ప్రవళిక, ద్వితీయ బహుమతి కుమ్మరి శ్రీజ బహుమతులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రావుకు బీజేపీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు నాగరాజు, విజయ మాదవి, బీజేపీ కుకున ఎరుపల్లి, ములుగు మండలాధ్యక్షులు సంపత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ కోచ్‌గా గూళ్ల వికాస్

నవతెలంగాణ-అక్కన్నపేట



32వ జాతీయస్థాయి త్రోబాల్ తెలంగాణ జట్టుకు కోచ్‌గా గూళ్ల వికాస్ ఎంపికైనట్టు తెలుస్తోంది. ఈ నెల28 నుంచి 30 వరకు చత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయ స్థాయి త్రోబాల్ తెలంగాణ జట్టు పాల్గొనడానికి చత్తీస్‌ఘఢ్‌కు వెళ్తున్నారు. దీనిలో భాగంగానే అక్కన్నపేట మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన గూళ్ల వికాస్ తెలంగాణ త్రోబాల్ బాల, బాలికల జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

ప్రయివేటు పాఠశాలల మండల కమిటీ ఏకగ్రీవం

నవతెలంగాణ-జగదేవపూర్



మండల కేంద్రంలో ప్రయివేటు పాఠశాలల మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారని ట్రస్మా రాష్ట్ర నాయకులు రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగదేవపూర్ మండలంలోని ప్రయివేటు పాఠశాలలతో సమావేశాన్ని నిర్వహించి సెయింట్ పీటర్స్ పాఠశాల కరెస్పాండెంట్ నర్సింహారెడ్డిని అధ్యక్షుడుగా, అక్షర పాఠశాల రెస్పాండెంట్ రామస్వామిని ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రయివేటు పాఠశాలల సమస్యలపై పోరాడాలని తెలిపారు. మండలంలో విద్యార్థులకు మంచి విద్యా అందించడానికి అన్ని పాఠశాలలు కట్టుబడి ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యాలయం సరితా,సెయింట్ విన్సెంట్ పాఠశాల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం



నవతెలంగాణ-జగదేవపూర్

మండలంలో మండల విద్యాధికారిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉదయ భాస్కార్‌రెడ్డికి, నూతనం గా విధుల్లో చేరిన మండల విద్యాధికారి మాధవరెడ్డిలకు జగదేవపూ ర్ మండల సమగ్ర శిక్ష ఉద్యోగుల తరపున సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులను ఎప్పుడు మరిచిపోమన్నారు. సంపాదన మాత్రమే కాదు ప్రేమాప్యాయత కూడా మనుషుల్లో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘం అధ్యక్షులు మల్లని దయానంద్, ప్రధాన కార్యదర్శి ఆకుల కరుణాకర్, కోశాధికారి రమణ కుమార్, సమగ్ర శిక్ష ఉద్యోగులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మండలంలోని ఉపాధ్యాయ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని అరెస్టు చేయడం అప్రజాస్వామికం

-రామోజీ ఫిలిం సిటీలో పేదలకు కేటాయించిన భూములను పేదలకే ఇవ్వాలి

-సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



ప్రభుత్వం రామోజీ ఫిలిం సిటీ వద్ద పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను రోడ్లను 350 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న రామోజీ యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని, పట్టాలు ఉన్న పేదల భూములు పేదలకే దక్కాలని, ప్రజల తరపున పోరాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని, రంగారెడ్డి జిల్లా పార్టీ నాయకత్వాన్ని, ప్రజలను అరెస్టు చేయడం ప్రజాస్వామికమని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అరెస్టులను ఖండించారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయం కార్మిక కర్షక భవన్లో జరిగిన సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ.. పద్దెనిమిది ఏండ్ల క్రితం ఇండ్లు లేని పేదలకు పటాలిచ్చిన ప్రభుత్వం ఆ స్థలాలను రామోజీ యాజమాన్యం ఆక్రమించి రోడ్లు మూసివేసి పట్టాలున్న పేదలను అడ్డుకుంటున్నారన్నారు. ప్రజలకు ప్రత్యామ్నాయం కూడా చూపకుండా పద్దెనిమిది ఏండ్ల నుంచి ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయన్నారు. 2007లో ఏడు వందల మందికి ఒక్కొక్కరికి అరవై గజాల చొప్పున పటాలిచ్చారని కానీ పేదలను ఆ భూమి మీదికి వెళ్లి నివాసం ఏర్పాటు చేసుకోకుండా రామోజీ సంస్థ దారిని ఆక్రమించి, సెక్యూరిటీని పెట్టి అడ్డుకుం టున్నారన్నారు. ప్రభుత్వం పేదలకు ఆ ఇంటి స్థలాలను అప్పగించాలని, ఇండ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం అధికార యంత్రాం గం రామోజీ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ఉద్యమాలను నిర్బంధాల ద్వారా ప్రభుత్వాలు అడ్డుకోలేవని పట్టాలు ఉన్న పేదలందరికీ ఇల్లు కట్టించి ప్రభుత్వం ప్రజాపాలనగా రుజువు చేసుకోవాలని అన్నారు. లేని పక్షంలో గత ప్రభుత్వాలకు చెప్పిన బుద్ధి ఈ ప్రభుత్వా నికి కూడా ప్రజలు చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామిని గోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, జాలిగపు శిరీష, తదితరులు పాల్గొన్నారు.

100 శాతం పన్ను వసూలుకు అందరూ సహకరించాలి

-మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు

నవతెలంగాణ-సిద్దిపేట



100 శాతం పన్ను వసూలుకు అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సుకోరారు. పురపాలక సంఘ కార్యాలయంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం గురువారం చైర్ పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్యవసర సమావేశం నిర్వహించడానికి ముఖ్య ఉద్దేశం ఇంటి, నీటి పన్నులు వసూలకు పాలకవర్గం సహకరిస్తూ, 100 శాతం పన్ను వసూల్లో సిద్దిపేట పురపాలక సంఘాన్ని ముందంజలో ఉంచాలన్నారు. పురపాలక సంఘం రెవెన్యూ సిబ్బంది ఇప్పటికే రూ.14 కోట్ల 28 లక్షలను వసూలు చేసిందని, ఇంకా రూ.కోటి 36 లక్షలు వసూలు చేయాల్సి ఉందని, సమయం తక్కువగా ఉన్నందున పన్ను వసూళ్లకు అందరూ సహకరించాలని కోరారు. పట్టణ ప్రజల సహకరించాలని కోరారు. ఇంటింటికి తిరుగుతూ పన్ను అధిక మొత్తంలో వసూలు అయినందుకు కమిషనర్ అశ్రిత్ కుమార్, రెవెన్యూ సిబ్బందికి, పాలకవర్గంకు అభినందనలు తెలిపారు. వీలైతే నీటి సరఫరా జరగని నల్ల కనెక్షన్లను ఆన్లైన్లో నుంచి తొలగించాలన్నారు. పట్టణంలోని కొన్ని పాత గృహాలకు తాతల కాలం నాటి నుండి ఇంటి పత్రాలు లేవని, అలాంటి వాటికి ఫ్యామిలీ మెంబర్, మరణ ధ్రువ పత్రాల ఆధారంగా పేరు మార్పిడి చేయాలని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో వార్డ్ ఆఫీసర్లతో నల్ల కనెక్షన్ ఉన్నప్పటికీ మంచినీటి సరఫరా జరుగని, ఒక ఇంటికి రెండు నల్లా కనెక్షన్లు ఉన్నటువంటి వాటిని గుర్తించేలా సర్వే నిర్వహించి అలాంటి వాటి గురించి సీడీఎంఏ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తానన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కమిషనర్ అశ్రిత్ కుమార్, కౌన్సిల్ అండ్ కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కళాశాలలపై పునర్విచారణ జరపాలని వినతి పత్రం

నవతెలంగాణ-గజ్వేల్



యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 105 కళాశాలలకు గుర్తింపు ఉందని కళాశాలలకు అటానమస్ ప్రకటించింది. వాటిపై మళ్లీ పునర్ విచారణ జరపాలని కోరుతూ గురువారం ఢిల్లీలోని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో యూజీసీకి వినతిపత్రం అందించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అనేక కళాశాలలకు అటానమస్ గుర్తింపు ప్రకటించడం అనేక అనుమానాలకు దారితీస్తుందన్నారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ న్యూఢిల్లీ వారు తక్షణమే స్పందించి కళాశాలల అటానమస్ గుర్తింపును నిలిపివేయాలని కోరారు. రాష్ట్రంలోని ప్రయివేటు అటానమస్ కళాశాలల యజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, విద్యార్థుల వద్ద ఎక్కువ మోతాదులలో ఫీజులు వసూలు చేస్తూ, విద్యని వ్యాపార వస్తువుగా తయారు చేస్తున్నారు. అనేక కళాశాలలో కనీస వసతులు కూడా కల్పించకుండా అటానమస్ ప్రకటించడం సిగ్గుచేటని మండిపడ్డారు. అదేవిధంగా అధికారుల ఆస్తులపై కూడా సీబీఐ విచారణ జరిపే విధంగా యూజీసీ దృష్టి పెట్టాలన్నారు. లేని పక్షంలో యూజీసీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే యూజీసీ ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలోత్ రాజేష్ నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సంద గణేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాలకురి హరీష్ ఇతర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

గజ్వేల్ నుంచి కరకపట్ల, బండ మైలారంకు బస్సులు వేయాలి

-సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ పట్టణం నుంచి కర్కపట్ల, వర్గల్ మీదుగా బండ మైలారం వరకు పారిశ్రామిక కేంద్రాలకు బస్సులు నడపాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మర్కుకు మండలంలోని కర్కపట్ల గ్రామం పరిధిలో పరిశ్రమలు ఉన్నాయని ఎర్రవల్లి మీదుగా కర్కపట్ల పారిశ్రామిక కేంద్రానికి బస్సు నడపాలని, వర్గల్ నూతన పారిశ్రామిక పార్క్‌తో పాటు, సింగన్నగూడ, కొత్తూరు, బండ మైలారం, బండ తిమ్మాపూర్ పారిశ్రామిక పార్కులకు అనుసంధానంగా బస్సులను నడపాలన్నారు. గజ్వేల్ పట్టణం, ఆర్అండ్ఆర్ కాలనీ ప్రజలకు ఉపాధి కల్పించే విధంగా పురుషులకు, స్త్రీలకు పరిశ్రమంలో ఉపాధికి పోయి వచ్చే విధంగా సమయపాలన అనుసరించి బస్సులు వేయా లన్నారు. ఆ గ్రామాల ప్రజలు నియోజకవర్గ కేంద్రానికి, ఆర్డీవో కార్యాలయంకు రావాల న్నా మూడు నాలుగు బస్సులు మారాల్సి వస్తుందని లేదా వ్యక్తిగత వాహనం ఉంటే తప్పరాని పరిస్థితి ఉందని అన్నారు. ప్రజల రవాణా సౌకర్యార్థం, పరిశ్రమలో ప్రజల ఉపాధికి బస్సులో సౌకర్యం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. మూడు పూటల్లో రెండు బస్సులు చొప్పున వేసి రవాణా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. రవాణా శాఖ యాజమాన్యం దీనిపై స్పందించి బస్సులు నడపాలని కోరారు. బస్సులు నడిపినట్లు అయితే ఉపాధి కోసం యువత కూడా పరిశ్రమలో పని చసేందుకు వెళ్లుతారన్నారు.

నాగార్జున డెయిరీ మిల్క్ పార్లర్‌లో నాణ్యమైన ప్రొడక్ట్స్

-డెయిరీ సీఈఓ కృష్ణ ప్రసాద్, సేల్స్ మేనేజర్ శివకుమార్

నవతెలంగాణ-నంగునూరు

వినియోగదారులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన నాగార్జున ప్రొడక్ట్స్‌ను అందించాలనే ఉద్దేశంతో డెయిరీ మిల్క్ పార్లర్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని డెయిరీ సీఈఓ కృష్ణ ప్రసాద్, సేల్స్ మేనేజర్ శివకుమార్‌లు తెలిపారు. మండల కేంద్రంలో నాగార్జున డెయిరీ మిల్క్ పార్లర్ ప్రారంభోత్సవంలో భాగంగా సొసైటీ చైర్మెన్ కోల రమేశ్ గౌడ్, నాయకులు కోల మహేందర్ గౌడ్‌లు ముఖ్య అతిధులుగా పాల్గొని డెయిరీ మిల్క్ పార్లర్ ఏజెంట్ ఉల్లి చిన్న మల్లయ్యతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2006 లో పుల్లూరి ప్రభాకర్ రావుచే పెద్ద పాపాయిపల్లిలో స్థాపించబడి లక్ష మంది పాడి రైతుల కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తూ 70 వేల లీటర్ల పాలను దిగుమతి చేసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులకు వంద శాతం నాణ్యమైన పాలు, పాల పదార్థాలు అందజేస్తూ రాష్ట్రంలో అత్యుత్తమ డెయిరీగా నాగార్జున డెయిరీ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్దిపడగ కిష్టారెడ్డి, రాంరెడ్డి, చెలికాని మల్లేశం, మద్దూరు నర్సింలు గౌడ్, కనకయ్య, బాల పోచయ్య, పాపిగారి నరేశ్, బెదురు మల్లేశం, కంపెనీ ఏఎస్ఎంలు విజయ్, వెంకటేష్, రాకేశ్ పాల్గొన్నారు.



అప్డేటెడ్ ఆధార్ కార్డుతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలి

-ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యం

-సిద్దిపేట బస్సు డిపో మేనేజర్ రఘు

నవతెలంగాణ-సిద్ధిపేట



ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే మహిళలు తప్పనిసరిగా అప్డేట్ చేసిన ఆధార్ కార్డులను ఉపయోగించుకోవాలని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే మా అంతిమ లక్ష్యమని సిద్దిపేట బస్సు డిపో మేనేజర్ రఘు అన్నారు. సిద్దిపేట డిపో నూతన మేనేజర్‌గా బదిలీపై వచ్చి ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన డిపోలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత 30ఏళ్లగా ఆర్టీసీలో పనిచేసిన అనుభవం ఉందని, భూపాలపల్లి, యాదగిరిగుట్ట, హాయత్‌నగర్, కాచిగూడ డిపోల్లో మేనేజర్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. సిద్దిపేట, దుబ్బాక డిపోల్లో సుమారు 500మంది సిబ్బంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరి సహకారం, సమిష్టి కృషితో రెండు డిపోలను లాభాల బాటలో తీసుకెళుతానన్నారు. కార్మికుల సంక్షేమం, ప్రయాణికులకు రవాణ పరంగా ఏలాంటి ఇబ్బందులు లేకుండా పనిచేస్తానని తెలిపారు.

రూ.151 కే భద్రాద్రి తలంబ్రాలు ఇంటికి..

శ్రీరామ నవమి సందర్భంగా ఆర్టీసీ కార్గో సేవల ద్వారా భద్రాద్రి సీతారామచంద్ర స్వామి కళ్యాణ తలంబ్రాలను ఇంటి వద్దకు పంపించడం జరుగుతుందని డీఎం తెలిపారు. రూ.151 డబ్బులు చెల్లిస్తే ఆర్టీసీ కార్గో ద్వారా ఇంటి వద్దకే తమ సిబ్బంది స్వామి తలంబ్రాలు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు మహేశ్వరి, రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రామయ్య కళ్యాణం తలంబ్రాల్లో పాల్గొనడం నా అదృష్టం: జడ్జి

నవతెలంగాణ-గజ్వేల్: భద్రాచలం రామయ్య కళ్యాణం తలంబ్రాలను గోటితో కొలిచే కార్యక్రమంలో పాల్గొనడం తాను అదృష్టంగా భావిస్తున్నట్లు గజ్వేల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక అన్నారు. గురువారం రామనామ స్మరణ చేస్తూ గోటితో వడ్లను ఒలిచి సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజుకు తన నివాసంలో అందజేసి రామభక్తిని చాటుకున్నారు.

మృతుని కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

నవతెలంగాణ-తొగుట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన యామలింగం (40) బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు గురువారం ఆయన మృతదేహానికి నివాళి అర్పించి సంతాపం తెలిపారు. యామ లింగం భార్య లక్ష్మీ, కుమారుడు మధులను ఓదార్చి తన వంతుగా రూ.2500 ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో నాయకులు పిట్ల వెంకటయ్య, బండారు స్వామి గౌడ్, మత్స్య సహకార సంఘం చైర్మెన్ కత్తుల నరేష్, ఎంగలి లక్ష్మణ్, ఆంజనేయులు, పులిగారి లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

కేసుల్లో పరిశోధన పారదర్శకంగా ఉండాలి

-ఫిర్యాధుదారుల మర్యాధకు భంగం కలిగించొద్దు

-సీపీ డాక్టర్ బి.అనురాధ

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



మహిళల రక్షణకు పెద్దపీట వేయాలని, కేసుల్లో పరిశోధన పారదర్శకంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ అన్నారు. గురువారం ఆమె గజ్వేల్ డివిజన్ పోలీస్ అధికారులతో కమిషనర్ కార్యాలయంలో పెండింగ్ ఉన్న కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి స్పీడ్ లేజర్ గన్ తో కేసులు నమోదు చేయాల న్నారు.దొంగతనాల కేసులలో అరెస్టు చేసిన నిందితులపై సస్పెక్ట్ షీట్స్ ఓపెన్ చేయాలన్నారు. నేను సైతం ద్వారా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు జియో టాకింగ్ పూర్తి చేయాలని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్స్ పై ప్రత్యేకమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు.గంజాయి ఇతర మత్తు పదార్థాలను ఉక్కు పాదంతో అణిచివేయాలని సూచించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే రెస్పాండ్ అయి స్వార్థమైనంత త్వరగా సంఘటన స్థలానికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి, సీఐలు సైదా, ముత్యం రాజు, లతీఫ్, మహేందర్ రెడ్డి, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, గజ్వేల్ డివిజన్ ఎస్ఐలు ఏఏ యాదమ్మ, పాల్గొన్నారు.

పదోన్నతులు పోలీసులకు మరింత బాధ్యతను పెంచుతాయి



పదోన్నతులు పోలీసులకు మరింత బాధ్యతను పెంచుతాయని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అన్నారు. భూంపల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ బాలమల్లయ్యకు ఎస్ఐగా, ఏఆర్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందడంతో వారు గురువారం మర్యాదపూర్వకంగా సీపీని కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పదోన్నతులు పొందిన పోలీస్ సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని కోరారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణతో బాధ్యతగా విధుల పట్ల నీ బద్దతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు గౌరవ మర్యాదలు లభిస్తాయని తెలియజేశారు.

పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు అందజేత

జిల్లాలో గత కొన్ని రోజుల నుంచి పడిపోయిన, దొంగలించబడినఫోన్ల సివిఆర్ టెక్నాలజీతో రికవరీ చేసి గురువారం కమిషనర్ కార్యాలయంలో సీపీ డాక్టర్ బి.అనురాధ సంబంధిత బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ ఎక్కడైనా పడిపోయిన ఎవరైనా దొంగలించకపోయిన వెంటనే సిఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) లో డాటా నమోదు చేస్తే రికవరీ చేసే అవకాశం ఎక్కువగా వుంటుందనీ తెలిపారు. ఫోన్ దొరికిన బాధితులు మీ బంధువుల్లో మీ గ్రామాల్లో మీ స్నేహితులను ఎవరైనా ఫోన్ దొంగతనం జరిగిన ఎక్కడైనా పడిపోయిన వెంటనే పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేయాలి అనే విషయంపై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు.



వలస కూలీ నుంచి రూ.26 వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు



నవతెలంగాణ-మద్దూరు

పొట్ట చేత పట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి వచ్చి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఓ వలస కూలి నుంచి రూ.26 వేలు సైబర్ నేరగాళ్లు కాజేసిన సంఘటన మండలంలోని నర్సాయపల్లి, గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుమార్, అనే మేస్త్రి వద్ద మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురు కూలీలు పనిచేస్తున్నారు. నలుగురి కూలీల్లో ఒకరైన వినోద్‌కు గురువారం ఉదయం 9685695940 ఫోన్ నెంబర్ నుంచి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి తాను పోలీసును మాట్లాడుతున్నానని నీపైన కేసు నమోదైనట్లు తెలిపారు. కేసును తీసివేయాలంటే వెంటనే ఈ నెంబర్ కు 50వేలు పంపించాలని బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన వినోద్, తన ఫోన్లో నుంచి పేటీఎం ద్వారా రూ.26 వేలు పంపించాడు. ఈ విషయాన్ని తన స్నేహితులకు తెలుపగా వారు సదరు నెంబర్‌కు ఫోన్ చేయడంతో ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది దీంతో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు గ్రహించి స్థానిక మద్దూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సర్టిఫికెట్ల జారీకి సరైన ధ్రువపత్రాలు సమర్పించాలి

-మద్దూరు తహసీల్దార్ ఎంఏజి రహీం



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు కులము, ఆదాయము, నివాసము సర్టిఫికెట్లను తీసుకునేందుకు సరైన ధ్రువపత్రాలు సమర్పించాలని మద్దూరు తహసీల్దార్ ఎంఏజి రహీం కోరారు. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రజలు విద్యార్థులు ఆ సర్టిఫికెట్లను తీసుకునేందుకు మీ సేవలో అప్లై చేసుకునేందుకు కులం సర్టిఫికెట్ కొరకు టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఓల్డ్ క్యాస్ట్ సర్టిఫికెట్, కుటుంబ సంబంధిత క్యాస్ట్ సర్టిఫికెట్, జిరాక్సులు ఇందులో ఏదైనా జత చేయాలని కోరారు. అలాగే ఆదాయం సర్టిఫికెట్ కోసం రేషన్ కార్డ్ జిరాక్స్, వ్యవసాయ భూమి ఉన్న వారు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ జత చేయాలని కోరారు. అదేవిధంగా నివాసం సర్టిఫికెట్ కోసం రేషన్ కార్డు, ఓటర్ ఐడి, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాల్లో ఏదైనా ఒకటి జత చేయాలని కోరారు. ఇలా చేయడం వల్ల సర్టిఫికెట్లు జారీ చేయడంలో త్వరగా పని పూర్తవుతుందని తెలిపారు.

ఆలయ ఉద్యోగిపై దాడి ఘటనలో కేసు నమోదు

నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న ఆలయ ఉద్యోగిపై ఔట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తు దాడి చేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదైనట్లు గురువారం ఎస్ఐ రాజు తెలిపారు ఆయన తెలిపిన వివరాల ప్రకారం...కొమురవెల్లి మల్లన్న ఆలయంలో టెంపుల్ ఇన్స్పెక్టర్‌గా సార్ల విజయ్ కుమార్ విధులు నిర్వహిస్తున్న సమయంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆరెళ్ల మహేష్, ఎక్కలదేవి వినయ్ కొంత మంది భక్తులను దర్శనం కోసం వెనుక మెట్ల దారిలో తీసుకుని వచ్చాడని, విజయ్ కుమార్ దర్శనానికి వెనుక మెట్లనుంచి రావద్దని చెప్పడంతో విజయ్ కుమార్‌ను మహేష్ మాటలతో దుర్భాషలాడి, సెల్ ఫోన్‌తో కొట్టడంతో ఎడమ చేతికి గాయమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని, దాడికి పాల్పడిన వారిపై కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంబించినట్లు ఎస్ఐ తెలిపారు.

గాగిల్లాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-మద్దూరు



మండలంలోని గాగిలాపూర్ గ్రామంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.4లక్షల నిధులు సీసీ రోడ్డు పనులకు మంజూరు చేయడంతో బీఆర్ఎస్ మద్దూరు మండలాధ్యక్షుడు మేక సంతోష్ కుమార్, గురువారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గ్రామాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొల్లు కృష్ణవేణి చంద్రమౌళి, గ్రామ శాఖ అధ్యక్షుడు చెవిటి మహేష్, పీఏసీఎస్ డైరెక్టర్ మేక మల్లేశం, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఉమామహేశ్వర్, నాయకులు సత్యనారాయణ, బాలరాజు, అశోక్, బాలయ్య, రాములు, కిష్టయ్య రవి,మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ కోహెడ మండలాధ్యక్షుడిగా శ్రీకాంత్

నవతెలంగాణ-కోహెడ



మండలంలోని పరివేద గ్రామానికి చెందిన ఖాత శ్రీకాంత్‌ను బీఎస్పీ కోహెడ మండలాధ్యక్షుడిగా నియామకం చేసినట్లు నియోజకవర్గ ఇంఛార్జీ పచ్చిమట్ల రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో గెలుపొందే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల వెంకన్న జిల్లా ఉపాధ్యాక్షులు మల్లేశం, ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుపతి, సీనియర్ నాయకుడు సుధాకర్, నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రాజు, రమాదేవి, బోయిని బాబు, భూసమల్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్ తైబజార్ వేలం



నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల కేంద్రంలో గ్రామపంచాయతీ పరిధిలోని తైబజార్, పశువుల సంత వేలంపాట మండల పంచాయతీ అధికారి సయ్యద్ గఫూర్ ఖాద్రీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల సంత వేలంపాటలో ఆరుగురు పాల్గొనగా ముబారస్ పూర్ గ్రామానికి చెందిన అబ్బగౌని రాజ్ గౌడ్ రూ.లక్ష 81 వేలకు దక్కించుకున్నారు. తైబజార్ వేలం ప్రభుత్వం నిర్ణయించిన రూ.4,01,560లకు ఐదుగురు పాల్గొనగా రూ.3 లక్షల 25 వేలకు వేలంపాట తక్కువగా వచ్చినందుకు వేలంపాట శనివారానికి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీను, మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సీనియర్ అసిస్టెంట్ మృతి

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



హుస్నాబాద్ ఆర్‌డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న హరీష్ కుమార్ (48) గుండెపోటుతో మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోతి రాంపూర్‌లో నివాసం ఉంటున్న హరీష్ కుమార్ ప్రతిరోజు విధులకు హాజరవుతున్నారు. బుధవారం రాత్రి అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించారు. అయినప్పటికీ పరిస్థితి విషయం నుంచి మృతి చెందాడు. తోటి ఉద్యోగి మృతి చెందడంతో రెవెన్యూ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

'రాజీవ్ యువ వికాసం'లో ఆర్యవైశ్యులకు అవకాశం పట్ల హర్షం

నవతెలంగాణ-దౌల్తాబాద్



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ సిద్ధిపేట జిల్లా అధ్యక్షురాలు పబ్బ మాధవి అశోక్ ఆర్థికంగా వెనుకబడిన బలహీన వర్గాల ప్రజలకు చేయూత అందిచడానికి ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయం అన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాతకు కృతజ్ఞతలు తెలిపారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరూ యువవికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సిహెచ్ జనార్దన్ రెడ్డి

నవతెలంగాణ-సిద్ధిపేట



సిద్ధిపేట బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా సిహెచ్ జనార్దన్ రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రెటరీగా తాటికొండ రమేష్, జాయింట్ సెక్రెటరీగా వెంకటాచారి ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని న్యాయవాదులు సన్మానించి, ఘనంగా సన్మానించారు.

తాటికొండ రమేష్ కు సన్మానం... సిద్ధిపేట జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయిన తాటికొండ రమేష్‌ను గజమలతో సత్కరించి, 1వ వార్డ్ ఫ్రెండ్షిప్ యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శేఖర్,రాజు,తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి

నవతెలంగాణ-తొగుట



ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ గురై రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం ప్రకారం గ్రామానికి చెందిన మన్నె లోకేందర్ (38) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం ఉదయం వరి పంటకు నీరు పెట్టి, పాడి గేదెకు గడ్డి కోసుకువస్తనని చెప్పి వెళ్ళాడు. ఉదయం 9 గంట ల తరువాత మృతుని అన్నా మన్నే ఎల్లయ్య పోన్ చేసి లోకేందర్ వొడ్డుపై పడి ఉన్నాడని తెలిపాడు. తన బార్య మన్నే శైలజ కొందరు గ్రామస్థులతో కలిసి వెళ్ళి చూసి వెంటనే సిద్ధిపేట ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం పూర్తి అయిన తరువాత శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. మృతునికి భార్య శైలజ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాద వశాత్తూ విద్యుత్ షాక్‌తో లోకెందర్ మృతి చెందడం బాధ కారణమని, కుటుంబ యజమాని మృతి చెందడంతో బార్య, పిల్లలు విదిన పడ్డారని గ్రామస్థులు అవేదన వ్యక్తం చేశారు. కుటుంబాన్ని ప్రభుత్వము ఆదుకోవాలని కోరారు.

నత్తనడకన డబుల్ రోడ్డు పనులు



- ఐదు నెలలకుపైగా కొనసాగుతున్న పనులు
- దుమ్ముదూళితో ఇబ్బందులను ఎదుర్కోంటున్న ప్రజలు

నవతెలంగాణ-కోహెడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలనే సదుద్దేశంతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని గొప్పలు చెప్పుకొంటున్నప్పటికి డబుల్ విస్తరణ పనుల్లో అలసత్వం వహిస్తూ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. కోహెడ మండల కేంద్రం నుంచి కోహెడ ఎక్స్ రోడ్డు వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చెసేందుకు లక్కీ కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్ట్ తీసుకున్నట్లు సమాచారం. దీంతో గత నాలుగు నెలల క్రితం సింగిల్ రోడ్డును తీసివేసి కంకర, మట్టితో చదును చేసి పనులను ప్రారంభించారు. కాగా సుమారు కొన్ని కిలోమీటర్ల మేర కంకర తేలి ఉండడంతో వాహనచోదకుల బాధలు అంతాఇంతా కాదు.

వాహనచోదకుల ఇబ్బందులు

బైక్‌పై వెళ్తున వారు ఎక్కడ పడిపోతామో అనే భయంతో వాహనాలను నడుపుతున్న పరిస్థితి నెలకొంది. అటువైపుగా పాదాచారులకు వెళ్తున్న సమయంలో రోడ్డుపై ఉన్న కంకర రౌతులు వాహనాల రాకపోకలతో వచ్చి తగిలి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. అలాగే ఇరువైపుల వాహనాలు, లారీ, బస్సు లాంటి పెద్ద వాహనాలు వచ్చినపుడు దుమ్ము, దూళితో రోడ్డు పక్కనే ఉన్న పంటలు పాడైపోతున్నాయని పలువురు రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే వెంకటేశ్వరపల్లి గ్రామస్థులకు ఇండ్లలోకి దుమ్ము చేరి ఇంటి పరిసరాలు, పలువురు గ్రామస్థులు అనారోగ్యానికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు పనులు చెసేందుకు మేము సిద్ధం

రోడ్డు పనులు చెసేందుకు మేము సిద్ధంగా ఉన్నప్పటికి విద్యుత్ పోల్‌లు అడ్డుగా ఉన్నాయి. విద్యుత్‌శాఖ అధికారులకు చెప్పాము. ఎప్పుడు విద్యుత్ పోల్స్ జరిపితే అప్పుడు పని ప్రారంభిస్తాం. నేడు ఉదయం పోల్స్ షిఫ్ట్ చేపించినట్లయితే సాయంత్రమే పనులు ప్రారంభిస్తాం.

– లక్కి కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకుడు

వెంకటేశ్వరపల్లి గ్రామస్థుల రాస్తారోకో

ఇటీవల వెంకటేశ్వరపల్లి గ్రామస్థులు దుమ్ము, దూళితో అనారోగ్యానికి గురవుతున్నామనమని రోడ్డుపై భైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఐనప్పటికి ఎలాంటి స్పందనలేదని గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని పలువురు మండల ప్రజలు కోరుతున్నారు.



ఎస్టిమేషన్ వేసి ఆర్ అండ్ బీ అధికారులకు పంపించాం

డబుల్ రోడ్డు విస్తరణ పనులలో భాగంగా విద్యుత్ పోల్స్ అడ్డుగా ఉండడంతో సంబంధిత ఎస్టిమేషన్ వేసి ఆర్ అండ్ బీ అధికారులకు పంపించాం. ఎస్టిమేషన్ కూడ సాంక్షన్ అయ్యింది. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకుంటాం.

– రవీందర్ (విద్యుత్‌శాఖ ఏఈ)

అవసరమైతేనే సోషల్ మీడియాను వాడాలి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

విద్యార్థులు అవసరమైతే తప్ప సోషల్ మీడియా అతిగా వినియోగించవద్దని హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలోని సెంట్ జోసెఫ్ హై స్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులకు మహిళల రక్షణ, సైబర్ నేరాలు ,గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, ఈవిటీజింగ్ నూతన చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు తెలుపవద్దని సూచించారు. ఇష్టపడి చదివి ఉన్నత స్థానానికి వెళ్లాలని తెలిపారు. సోషల్ మీడియా వాట్సప్, ఫేస్బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ స్టేటస్ లలో మీ కుటుంబానికి సంబంధించిన ఫోటోలు పెట్టి ఇబ్బందులకు గురికావద్దన్నారు. ప్రతి విద్యార్థికి చదువు చాలా ముఖ్యం, ఎవరికన్నా ఏదైనా జరిగితే మనకెందుకులే అని నిర్లక్ష్యం నిర్లక్ష్యం చేయకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ విజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట



ఆశ, భయము అనే పేరుతో సైబర్ నేరస్తులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు అన్నారు. బుధవారం రాత్రి తొగుట పోలీస్ స్టేషన్ పరిధిలోని తుక్కాపూర్ గ్రామంలో పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం పోలీసు కళా బృందం ప్రజలను చైతన్య పరిచే కనువిప్పు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. బ్యాంకు అధికారులమని ఫోన్ చేస్తే నమ్మవద్దని, అకౌంట్ డీటెయిల్స్, పర్సనల్ డీటెయిల్స్ గుర్తుతెలియని వ్యక్తులకు పంపించ వద్దన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. మూఢనమ్మకాలు, రోడ్డు ప్రమాదా లు, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సామాజిక రుక్మతల గురించి సిద్దిపేట పోలీస్ కళాబృందం నాటకం పాట ల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన కాయకల్ప బృందం

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో గురువారం కాయకల్ప పీర్ అసెస్మెంట్ నిర్వహించారు. హైదరాబాద్ గోల్కొండ ప్రభుత్వ దవాఖాన వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాయకల్ప బృందం గజ్వేల్ దవాఖానను పరీక్షించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ పుష్ప గుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు. కాయకల్ప సభ్యులు డాక్టర్ శ్రీనివాస్, పద్మావతి, విజేత, పాతిమ, మేరీ సుష్మిత, మనోజ్‌లు దవాఖానలోని వివిధ వార్డులు ఆపరేషన్ థియేటర్, లేబర్ రూమ్, స్వచ్ఛత నిర్వహణ, వేస్ట్ మేనేజ్మెంట్ తదితర అంశాలలో దవాఖానను క్షుణ్ణంగా పరిశీలించి గ్రేడింగ్ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. అనంతరం వారు ఆసుపత్రి నిర్వహణ తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్.జయ శ్రీ, ఆర్ఎంవో డాక్టర్ రాము, తదితరులు పాల్గొన్నారు.

రంగోత్సవ్ సెలబ్రేషన్‌లో 'జీడీఆర్' ప్రతిభ

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ పట్టణ కేంద్రంలో జీడీఆర్ హై స్కూల్‌లో గురువారం ముంబాయి ఆర్గనైజేషన్ రంగోత్సవ్ ఇంటర్నేషనల్ లెవెల్ ఆర్ట్ కాంపిటీషన్ విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, బహుమతులు జీడీఆర్ హై స్కూల్ ప్రిన్సిపాల్ శిల్పారెడ్డి, కరెస్పాండెడ్ మనోజ్ కుమార్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ.. గత నెల ఫిబ్రవరి 3న రంగోత్సవ కాంపిటీషన్‌లో 69 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఎంచుకున్న కలరింగ్, హ్యాండ్ రైటింగ్, కాలేజ్ మేకింగ్, కార్టూన్ మేకింగ్, తంబు ప్రింటింగ్, టాటో మేకింగ్, స్కెచ్చింగ్, కారికేచర్. ముంబాయి ఆర్గనైజేషన్ రంగోత్సవ్ ఇంటర్నేషనల్ లెవెల్ ఆర్ట్ కాంపిటీషన్ వారు నిర్వహిం చారని అన్నారు. జీడీఆర్ స్కూల్ నుంచి 7 విద్యార్థులు గెలుపొందారు. మిగతా విద్యార్థులకు స్పెక్టాకులర్ పెర్ఫార్మర్ అవార్డ్ అందజేశారు. విద్యార్థులు చదువు తో పాటు వారిలో దాగున్న ప్రతిభను బయటికి తీయడానికి ఇది చక్కటి వేదిక అని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడారు. స్కూల్ యాజమాన్యం విజయలక్ష్మి, నరసింహారెడ్డి చేతుల మీదుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచర్స్, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే అసమానతలు తొలగుతాయి

-ప్రొఫెసర్ బి శివారెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట



ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేట అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ బి.శివారెడ్డి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య ద్వారానే సామాజిక అభివృద్ధి జరుగుతుందని, అసమానతలు తొలగుతాయని, విద్యపైన బడ్జెట్ కేటాయింపులు ఉండాలన్నారు. సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా బీసీ కమిషన్ మెంబర్ ఆర్.బాలలక్ష్మి హాజరయ్యారు. నాణ్యమైన ఆరోగ్యం, నాణ్యమైన విద్య ద్వారానే అట్టడుగు వర్గాలకు లబ్ధి చేకూరుతుందని, ఉన్నతమైన లక్ష్యంతో జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ ముగింపు సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.సునీత అధ్యక్షత వహించారు. గౌరవ అతిథులుగా డాక్టర్ కే హుస్సేన్, డాక్టర్ అవినాష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి అయోధ్య రెడ్డి, కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, సదస్సు కన్వీనర్ శ్రద్ధానందం పాల్గొన్నారు

సీసీ రోడ్డు మీద మళ్లీ సీసీ రోడ్డు

- అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ లాభం
- నాణ్యతలేని సీసీ రోడ్డు
- బీజేపీ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



నాణ్యతలేని సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా కన్వీనర్ మల్లమ్మగారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చిన్న గుండవెల్లి గ్రామంలో నాణ్యతలేని సీసీ రోడ్ల నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీరాజ్ సూపరిండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ధనార్జన ధ్యేయంగా ఇష్టారీతన సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారని ఇదివరకు ఉన్న రోడ్లపైనే మళ్లీ సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతూ అసలు సీసీ రోడ్లు అవసరం ఉన్నచోట వేయడం లేదన్నారు. పాడైన సీసీ రోడ్లు ఉన్నచోట పాత వాటిని తొలగించ కుండానే వాటిపైనే కొత్త సీసీ రోడ్లను నిర్మిస్తున్నారని దీంతో ఆయా కాలనీలో ఇండ్లు రోడ్డు కన్నా దిగువకు వెళ్తున్నాయన్నారు. మొత్తంగా రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం నాణ్యత లేకుండా పోయిందని వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

భార్య మందలించడంతో భర్త ఆత్మహత్య

నవతెలంగాణ-రాయపోల్



తరచూ మద్యం సేవిస్తున్నాడని భార్య భర్తను మందలించడంతో విరక్తి చెంది ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం గొల్లపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. గ్రామానికి చెందిన ఎంకొల్ల కుమార్ (35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. బుధవారం ఎంకొల్ల కుమార్ మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. దీంతో భార్య మద్యం ఎందుకు తాగి వచ్చావని మందలించి, అమ్మమ్మగారి గ్రామం చేగుంట మండలం అన్నసాగర్ గ్రామానికి వెళ్ళింది. భర్త కుమార్ అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు ఎవరూ లేని సమయం లో ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. చుట్టుపక్కల వారి ద్వారా సమాచారం తెలుసుకున్న భార్య వెంటనే ఇంటికి చేరుకొని చూడగా కుమార్ ఇంట్లో ఊరు వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఎంకొల్ల మహంకాళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టులు















నవతెలంగాణ-అక్కన్నపేట

మాకు రావాల్సిన పెండింగ్ బిల్లులను అడిగితే కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టులు చేస్తోందని అక్కన్నపేట మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొమ్మగాని రాజేశం అన్నారు. మాజీ సర్పంచులకు ఇచ్చే పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా అరెస్టు చేసి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు బాసటగా ఉండాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా అరెస్టులతో కాలం గడుపుతోందని మండిపడ్డారు. మేము సర్పంచులుగా ఉన్నప్పుడు గ్రామస్థాయిలో క్రీడాప్రాంగణం, పల్లెప్రకృతి వనం, ట్రాక్టర్ డీజిల్, బ్లీచింగ్, సీసీ రోడ్లు, హరిత హరం, డంపింగ్ యార్డ్, మన ఊరు మన బడి, డ్రయినేజీలు, గ్రావెల్, వాటర్ మోటర్, వాటర్ పైప్ లైన్, కరెంట్ స్తంబాలు, వైరింగ్, ఇంకుడు గుంతలు, వ్యవసాయ కల్లాలు, పబ్లిక్ టాయిలెట్స్ వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశామని వాటి బిల్లులు ఇంకా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు అడిగితే అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే పెండింగ్ బిల్లుల విడుదల చేసి, సర్పంచ్ ఎలక్షన్స్ పెట్టాలన్నారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచులు అశోక్ రెడ్డి, సంపత్, రమేష్, యాదగిరిలున్నారు.

నవతెలంగాణ-తొగుట: మండలంలోని కొంత మంది మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్టు చేసి పోలీసు స్టేషన్లో నిర్బంధించడం సరికాదని సర్పంచ్ల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసి) రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నరసింహులు యాదవ్ అన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీకి ముట్టడికి వెళ్తారని నెపంతో మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ దుర్మార్గపు కాంగ్రెస్ పాలనలో మాజీ సర్పంచ్ లకు పెండింగ్ బిల్లులు ఇప్పించకుండా అన్యాయం చేస్తూన్నారని మండి పడ్డారు. ఇప్పటికైన ప్రజా ప్రభుత్వం కళ్ళు తెరిచి మాజీ సర్పంచ్ల ధర్నాలు రాస్తారోకోలు చేయకుండా తక్షణమే పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. అన్ని గ్రామాల మాజీ సర్పంచ్ లు ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వం పై మరో సారి భారీ ఎత్తున్న ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక మంలో లింగంపేట మాజీ సర్పంచ్ మంగ రేణుక నరసింహులు తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-మద్దూరు: మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన సర్పంచ్ ల ను మద్దూరు పోలీసులు గురువారం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచులు సుందరగిరి స్రవంతి పరశురాములు గౌడ్, జీడి కంటి సుదర్శన్, ఉట్ల రవీందర్ రెడ్డి, గంగి భాగ్యలక్ష్మి శ్రీనివాస్, బొల్లు కృష్ణవేణి చంద్రమౌళి, శివలాల్, తదితరులున్నారు.

నవతెలంగాణ-నంగునూరు : నంగునూరు మండల మాజీ సర్పంచ్‌లను గురువారం రాజగోపాల్ పేట పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ మండల మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. అసెంబ్లీని ముట్టడికి బయలుదేరిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు ఆందోళన కొనసాగిస్తామని మాజీ సర్పంచ్ బిక్షపతి నాయక్ తెలిపారు.

నవతెలంగాణ-బెజ్జంకి: అభివృద్ధి పనుల బిల్లులు విడుదల చేయాలని తలపెట్టిన అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్లకుండా మండలంలోని అయా గ్రామాల మాజీ సర్పంచులను గురువారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషనుకు తరలించారు. బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు.

నవతెలంగాణ-జగదేవపూర్: జగదేవపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచులను జగదేవపూర్ ఎస్ఐ చంద్రమోహన్‌పై స్థాయి అధికారులు సూచనల మేరకు గురువారం ముందస్తు అరెస్టు చేశారు. పెండింగ్ బిల్లుల కోసం అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా మండలంలోని మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నామన్నారు. అందులో భాగంగానే చాట్లపల్లి మాజీ సర్పంచ్ రాచర్ల నరేష్ , అంతయ గూడెం మాజీ సర్పంచ్ తిగుల్ల సత్యం, పీర్లపల్లి మాజీ సర్పంచ్ యాదవ రెడ్డి, కొండాపూర్ మాజీ సర్పంచ్ జహంగీర్, మునిగడప మాజీ సర్పంచ్ బాలక్ష్మి ఐలయ్యలను తెల్లవారు జామున అదుపులోకి తీసుకుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నవతెలంగాణ-రాయపోల్ : మాజీ సర్పంచులు తమ పెండింగ్లో ఉన్న బిల్లుల కోసం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారని ఉద్దేశంతో వారిని ముందస్తు అరెస్టు చేసి రాయపోల్ పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్లు మాట్లాడుతూ.. అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం సరైనది కాదన్నారు. పలుమార్లు ప్రభుత్వం దృష్టికి మా సమస్యలను తీసుకెళ్లినప్పటికీ పరిష్కరించపోవడం వలన అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే చర్య తీసుకుని ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టే బడ్జెట్ లోనే పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కాసుల మౌనిక రాజిరెడ్డి,రామోల్ల స్వామి, కరుణాకర్,బుచ్చమ్మ మౌలానా, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూడో క్రీడా పోటీలకు శ్రీచరణ్



నవతెలంగాణ-సిద్ధిపేట

సిద్ధిపేట జిల్లా కోహెడ మండలం నాగసముద్రల తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సీఈసీ చదువుతున్న శ్రీచరణ్ జాతీయ స్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారని జిల్లా జూడో సంగం అధ్యక్షులు నంట శ్రీనివాస్‌రెడ్డి, సెక్రెటరీ భరత్‌రెడ్డిలు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. 24న హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి జూడో -100 వెయిట్ కేటగిరి క్రీడలో అత్యంత ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించి, జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక అయ్యాడని తెలిపారు. ఈనెల 28 నుంచి 31 వరకు ఉత్తరాఖండ్ డెహ్రాడూన్ లో పిస్టల్ వీడ్ స్కూల్‌లో జరిగే జాతీయ స్థాయి జూనియర్ జూడో పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు, ఉపాధ్యాయ బృందం, ప్రజాప్రతినిధులు, కోచ్‌లు క్రీడాకారున్ని అభినందించారు.

మృతుని కుటుంబానికి బియ్యం అందజేత



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు గ్రామానికి చెందిన ఎడ్ల పోచయ్య కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబ పరిస్థితి తెలుసుకున్న నంగునూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రాగుల కృష్ణ వెంటనే టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు బొమ్మల యాదగిరి దృష్టికి తీసుకెళ్లారు. గురువారం వారు స్పందించి చెరొక 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చెలికాని యాదగిరి, బీసీ సెల్ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు గౌరి బోయిన సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకలు



నవతెలంగాణ-రాయపోల్

ముస్లిం సోదరులందరూ రంజాన్ పర్వదినాన్ని సంతోషంగా చేసుకోవాలని ఉద్దేశంతో నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకలు పంపిణీ చేయడం జరిగిందని ఉమ్మడి దౌల్తాబాద్ మైనార్టీ సెల్ మాజీ మండల అధ్యక్షులు మహమ్మద్ జహంగీర్ అన్నారు. గురువారం రాయపోల్ మండలం సయ్యద్ నగర్ గ్రామంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోదరులు ఎంతో పవిత్ర మాసంగా భావించే రంజాన్ నెలలో పేద ధనిక తేడా లేకుండా అందరూ పండుగను సంతోషంగా చేసుకోవాలని ఉద్దేశంతో సయ్యద్ నగర్ గ్రామంలో తన వంతు సహకారంగా పేద కుటుంబాలకు రంజాన్ కానుకలు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సయ్యద్ బాబు, షాదుల్, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-దౌల్తాబాద్


వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని దౌల్తాబాద్ మండల కేంద్రంలో ప్రారంభించారు. పట్టణంలోని శివాజీ చౌరస్తాలో సమీపంలో ఏర్పాటు చేసిన తొలిరోజు ఆర్యవైశ్య సంఘం సభ్యులు మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షురాలు పబ్బా అశోక్ మాధవి, పట్టణ అధ్యక్షులు గంప రవి,వాసవి క్లబ్ అధ్యక్షుడు శ్రీరామ్ శ్రీనివాస్, చంద్రమౌళి, అంజయ్య, చంద్రశేఖర్, శ్రీధర్, నవ్య, పద్మ, శ్రీరాం ప్రణవి తదితరులున్నారు.

కేసీఆర్ కృషితోనే సీఎం సహాయ నిధి పథకం

-ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

కేసీఆర్ కృషితోనే సీఎం సహాయ నిధి పథకాలను ప్రజలు ఇప్పటికి అందుకుంటున్నారని ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 44 మందికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష రూపాయల బిల్లు అవుతే కేవలం ఇప్పుడు రూ రూ.10 వేలు మాత్రమే ఇస్తుందన్నారు. గత ప్రభుత్వంలో ఆస్పత్రి ఖర్చుల్లో 50శాతం వరకు చెల్లించినట్లు గుర్తు చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో 9 మండలాల చెందిన బాధిత కుటుంబాలు సీఎం సహా నిధి చెక్కులను అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ రాజమౌళి, ఆత్మ కమిటీ మాజీ చైర్మెన్ కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బెండ మధు, తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఆర్ఎస్ పేరిట ప్రజలను దోచుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

నవతెలంగాణ-గజ్వేల్

పేద మధ్యతరగతి కుటుంబాల జేబులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌తో చిల్లులు పెడుతున్నాదని మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు మనోహర్ యాదవ్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ ఎల్ఆర్ఎస్ ప్రవేశపెడితే గగ్గోలు పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు దానితో ప్రజలను దోచుకుంటున్నారని ప్రశ్నించారు. మరో విచిత్రమేమిటంటే గజ్వేల్‌లో ఇంటి పర్మిషన్ తీసుకొన్న సమయంలో ఎల్ఆర్ఎస్ రెగ్యులేషన్ పేరుమీద లక్షల రూపాయలను ప్రభుత్వం దోచుకొన్న కుటుంబాలకు సైతం మళ్ళీ ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించాలని డిమాండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలను వేధించడం ఇదేనా ప్రజా ప్రభుత్వం అని మండిపడ్డారు. దోపిడీ ఆపకపోతే పెద్దఎత్తున బీజేపీ నేతృత్వంలో ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడిక్యాల రాములు, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు చెప్యాల వెంకట్ రెడ్డి, గజ్వేల్ పట్టణ బీజేపీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-రాయపోల్

అప్పుల బాధ భరించలేక అవి తీర్చే మార్గం కనబడక జీవితంపై విరక్తిచెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ షాదుల్లా (33) వాటర్ ప్లాంట్, చికెన్ సెంటర్ వ్యాపారం చేసుకుంటూ జీవిస్తూండేవాడు. గత కొన్ని రోజుల క్రితం షాదుల్లా ఇంటి నిర్మాణం కోసం ఓ ప్రయివేట్ బ్యాంకులో రూ.7లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పులు ఎలా చెల్లించాలని మదన పడుతుండేవాడు. మంగళవారం మధ్యాహ్నాం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో భార్య షాదుల్లాకు ఫోన్ చేస్తే ఫోనును వేరే వ్యక్తి లిఫ్ట్ చేసి మీ భర్త మంతూరు గ్రామ శివారులో పురుగుల మందు తాగి పడిపోయాడు. అతడిని 108 అంబులెన్స్ ద్వారా గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం బుధవారం డిశ్చార్జి చేశారు. గురువారం తెల్లవారుజామున ఆరోగ్యం మళ్లీ క్షీణించడంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుని



భార్య మహమ్మద్ సల్మా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

ఆన్లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలి

- మర్కుక్ ఎస్ఐ దామోదర్

నవతెలంగాణ-మర్కుక్

ఆన్లైన్ బెట్టింగ్ అండ్ గ్యాంబ్లింగ్ నుంచి యువత దూరంగా ఉండాలని మర్కుక్ ఎస్ఐ దామోదర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్, అక్రమ గేమింగ్ ప్లాట్ఫారమ్ ప్రమాదాల గురించి ప్రజలను హెచ్చరిస్తోందన్నారు. ఆర్థిక నష్టాలు, వ్యసనం, చట్టపరమైన పరిణామాలకు దారి తీస్తాయన్నారు. ఈజీ మనీ హామీలు - బెట్టింగ్ యాప్స అధిక లాభాలు కలిగిస్తాయని చెప్పి మోసం చేస్తారని హెచ్చరించారు. నియంత్రణ లేని ప్లాట్ఫారమ్లు,- అనేక యాప్స చట్టబద్ధమైన అనుమతులు లేకుండా నడుస్తూ డబ్బును వెనక్కి తీసుకునే అవకాశం లేకుండా పోతుందన్నారు. సోషల్ మీడియా ప్రచారాలు- ఇన్ఫ్లుయెన్సర్లు , నకిలీ టెస్టిమోనియల్స్ మోసపూరితంగా ప్రోత్సహిం చబడతాయన్నారు. తెలంగాణ లో ఆన్లైన్ బెట్టింగ్ నిషేధించ బడయని, ఆన్లైన్ గ్యాంబ్లింగ్లో పాల్గొన్నవారు. ప్రోత్సహించిన, సహకరించిన వారిపై తెలంగాణ గేమింగ్ చట్టం, 2017 అనుసరించి కఠిన చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. జాగ్రత్తగా ఉండండి, భద్రతపై పెట్టుబడి పెట్టండి, బెట్టింగ్ మోసాలకు గురికాకండని సూచించారు.



నూతన పంచాంగం ఆవిష్కరణ





నవతెలంగాణ-దౌల్తాబాద్

దౌల్తాబాద్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతన పంచాంగం ఆవిష్కరణ చేయడం జరిగిందని సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు పబ్బ మాధవి అశోక్ అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతన పంచాంగం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు సంవత్సరం ప్రకారం ఉగాది పర్వదినం సందర్భంగా నూతన సంవత్సరాన్ని చేసుకుంటామని, అప్పటి నుంచి నూతన పంచాంగాన్ని ప్రారంభించి పెళ్లిళ్లు, శుభకార్యాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతన పంచాంగం ఆవిష్కరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు పబ్బ అశోక్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు జిల్లా పద్మ, పట్టణ అధ్యక్షులు గంప రవి, ఉపాధ్యక్షులు నరేష్, కోశాధికారి ఆంజనేయులు, సభ్యులు చంద్రశేఖర్, అయిత వీరేశం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం..ఒకే ఎన్నిక అభివృద్ధికి సంకేతం

-బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్

నవతెలంగాణ-సిద్దిపేట

ఒకే దేశం, ఒకే ఎన్నిక భారత ప్రజాస్వామ్య అభివృద్ధికి సంకేతమని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ అన్నారు. గురువారం బీజేపీ సిద్దిపేట జిల్లా కార్యాలయంలో ఒకే దేశం, ఒకే ఎన్నిక జిల్లా కన్వీనర్ నలగామ శ్రీనివాస్ అధ్యక్షతన వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బైరి శంకర్ పాల్గొని మాట్లాడారు. ఒకే ఎలక్షన్, ఒకే దేశంతోనే ఆర్థికంగా చాలా లాభాలు ఉన్నాయని అన్నారు. ఒకేసారి లోక్ సభ, శాసనసభ ఎలక్షన్స్ జరపాలని,100 రోజుల్లోపు స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినట్లయితే అభివృద్ధి జరుగుతుందన్నారు. జమిలి ఎన్నికల పై ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కో కన్వీనర్ తోడుపునూరి వెంకటేశం, పార్లమెంట్ కో కన్వీనర్ చింత సంతోష్ కుమార్, బిజెపి సీనియర్ నాయకులు గుండ్ల జనార్దన్, మండల కన్వీనర్లు, కో కన్వీనర్లు పాల్గొన్నారు.

